ఉష్ణోగ్రత (అంచనా)

28-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	33	27
తెనాలి	32	27
నరసరావుపేట	33	27
బాపట్ల	33	28
రెంటచింతల	34	28
చీరాల	33	28

హలధారికి.. జలసిరి

- పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు
- మరో వారంలో విడుదల కానున్న మార్గదర్శకాలు
- కుసుమ్ పథకానికి అనుసంధానం చేసే దిశగా చర్యలు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు రూ.4 కోట్లు కేటాయించే అవకాశం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతులకు సాగునీటి కష్టాలు తీర్చే జలసిరి పథకాన్ని మళ్లీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జలసిరి పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పేరు మార్చి ఓ ప్రహసనంగా మార్చి రైతులను ఇబ్బందులకు గురి చేసింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా జలసిరి పథకాన్ని పునరుద్ధరించింది. రైతుల అభీష్టానికి అనుగుణంగా ఎన్టీఆర్ జలసిరి పేరిట పథకాన్ని తిరిగి అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కూడా జరిగింది. పథకం అమలులో భాగంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఉచిత బోర్ల అవసరాలపై ప్రభుత్వం ఇప్పటికే అధికారుల నుంచి నివేదిక తీసుకుంది. నిధుల కేటాయింపులో భాగంగా ఉమ్మడి జిల్లాల పరిధిలో తొలి విడతలో రూ.4కోట్లు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వారంరోజుల్లో ఎన్టీఆర్ జలసిరి పథకం అమలుకు సంబంధించి పూర్తి స్పష్టత రానుందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకాన్ని కేంద్ర ప్రాయోజిత పథకం కుసుమ్‌తో అనుసంధానం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. దీనిలో భాగంగా జలసిరి పథకానికి సోలార్ పంపుసెట్లకు అధిక ప్రాధాన్యమిచ్చేలా చూడాలనే ఆదేశాలు ఇప్పటికే ప్రభుత్వానికి వచ్చాయి. సోలార్ సౌకర్యం లేని చోట విద్యుత్ ఆధారితానికి వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాల వారీగా తవ్వే ఉచిత బోర్లలో దాదాపు 40 శాతం సోలార్ ఆధారంగానే పనిచేసేలా చూడాలనే నిబంధనను ప్రభుత్వం తప్పనిసరి చేయనుంది.ఒక్కో యూనిట్‌కు కేంద్ర ప్రభుత్వం వాటా 40 శాతం కాగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీ రూపంలో 30 శాతం భరించనుండగా మిగిలినది రైతు భరించేలా మార్గదర్శకాలు విడుదల కానున్నట్లు తెలుస్తోంది.

గతంలో 12,000 చేతిపంపులు

సాగునీరు సకాలంలో అందక పైర్లు ఎండిపోతున్న అంశాలను దృష్టిలో పెట్టుకుని చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం జలసిరి పథకాన్ని ప్రవేశపెట్టింది. వాల్టా చట్టం నిబంధనలను పాటిస్తూనే పొలాల్లో ఉచితంగా బోర్లు తవ్వించి విద్యుత్ కనెక్షన్ కూడా ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని అప్పట్లో ముమ్మరంగా చేపట్టింది. ఆ ఐదేళ్ల వ్యవధిలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.7 కోట్లు నిధులు ఖర్చుచేసి 12,000 మంది రైతుల ప్రయోజనాలను కాపాడింది. దీంతో సాగునీటి విషయంలో వరుణదేవుడి మీదనే ఆధారపడిన అవసరం లేకుండా రైతులు సాగు చేసుకునేవారు.



వైసీపీ నిర్లక్ష్యం

ఈ పథకం పేరును 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ వైఎస్సార్ జలకళగా మార్చింది. అయితే ఐదేళ్లలో కనీస స్థాయిలో కూడా ఆ పథకం అమలు చేయలేదు. నియోజకవర్గాల వారీగా రిగ్గులను కేటాయించడంతో సరిపెట్టింది తప్పితే నిర్దేశించుకున్న లక్ష్యాలపై దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. బాపట్ల జిల్లాలో 5,600 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 770 బోర్లు, గుంటూరు జిల్లాలో 560 దరఖాస్తులకు 135, పల్నాడు జిల్లాలో 10,600 దరఖాస్తులకు 1,100 బోర్ల తవ్వకంతో సరిపెట్టింది. అరకొరగా తవ్విన బోర్లకు కూడా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం చేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఇందులో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ జరిపి నిజానిజాల నిగ్గు తేల్చడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.



రేషన్.. 1 నుంచి షాపుల్లోనే

- దుకాణాల వద్దే సరుకుల పంపిణీకి ఏర్పాట్లు
- ఇక ఎండీయూల కోసం పడిగాపులు అవసరం లేదు
- పంపిణీని ప్రారంభించనున్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- వృద్ధులు, అనారోగ్య పీడితులకు ఇళ్ల వద్ద పంపిణీకి ఆదేశాలు
- రేషన్ వాహనాల వ్యవస్థను రద్దు చేసిన ప్రభుత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇక రేషన్ సరుకుల కోసం పడిగాపులు పడాల్సిన అవసరం లేదు. ఎప్పుడు రేషన్ వాహనం వస్తుందో తెలియక.. పనులకు వెళ్లలేక.. వెళ్తే ఆ నెలకు సరుకులు అందవేమోనని ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. ఎండలో.. వీధుల్లో.. రేషన్ సరుకులు తీసుకునేందుకు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన దుస్థితి పోయినట్లే. కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీలో కూటమి ప్రభుత్వం మార్పులు చేసింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో ఇక నెల మొదటి 15 రోజుల్లో ఎప్పుడు తీరిక ఉంటే అప్పుడు వెళ్లి సరుకులు తెచ్చుకోవచ్చు. సెలవు పెట్టి ఇళ్ల వద్ద ఉండాల్సిన అవసరం లేకుండా పనులు, విధులు ముగించుకుని, వీలున్నప్పుడు వెళ్లి.. లేదంటే సెలవు రోజుల్లోనే గతంలో మాదిరిగా దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకునే అవకాశం మళ్లీ వచ్చేసింది. ఈ క్రమంలో 1వ తేదీ ఆదివారం నుంచి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని రేషన్ దుకాణాల వద్దే సరుకులు పంపిణీకి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. 1వ తేదీ ఆదివారం రోజు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు రేషన్ షాపుల వద్ద సరుకుల పంపిణీ ప్రారంభించనున్నారు.

జరగని హేతుబద్ధీకరణ కష్టాలు

ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా రేషన్ దుకాణాల హేతుబద్ధీకరణ జరగలేదు. వాస్తవానికి ఒక్కో దుకాణం పరిధిలో 600 నుంచి 650 కార్డులు ఉండాలి. షాపులకు కార్డుల కేటాయింపు అస్తవ్యస్తంగా ఉంది. ఎక్కువ కార్డులున్న షాపుల్లోని కార్డులను తక్కువ ఉన్న వాటికి కేటాయించే ప్రక్రియ జరగలేదు. దీంతో కొన్ని షాపుల్లో 200 లోపు కార్డులు ఉంటే మరికొన్ని షాపుల్లో 1000 నుంచి 1500 వరకు కార్డులు ఉన్నాయి. దీంతో సరుకుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రేషన్ షాపులకు కార్డుల హేతుబద్ధీకరణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొన్ని షాపుల్లో కార్డులు అత్యధికంగా ఉండటంతో కార్డుదారులు సరుకులు తీసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు రానున్నాయి. కార్డుదారులు వీధిల్లోనే ఎండీయూల ద్వారా సరుకులు పంపిణీ చేయడంతో డీలర్ వద్ద కార్డులు ఎక్కువ, తక్కువ ఉన్నా ఇబ్బందులు తలెత్తలేదు. ఉదాహరణకు నరసరావుపేటలోని 368 నెంబరు షాపునకు 131 కార్డులు కేటాయిస్తే 427 నెంబరు షాపునకు 1148 కార్డులు కేటాయించారు. చిలకలూరిపేట పట్టణంలో 655 నెంబరు షాపులో 56 కార్డులు ఉంటే 696 నెంబరు షాపులో 1382 కార్డులు ఉన్నాయి. ఇదే పరిస్థితి గుంటూరు, బాపట్ల జిల్లాలతో పాటు పల్నాడు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ ఉంది. ఈ పరిస్థితుల్లో సరుకుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తనున్నాయన్న అభిప్రాయాన్ని కార్డుదారులు వ్యక్తం చేస్తున్నారు.


సరుకుల పంపిణీ ఇలా..

ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాలను తెరిచి ఉంచాలని డీలర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆయా రోజుల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు దుకాణాల వద్దే సరుకులు పంపిణీ చేయాలి. దుకాణం పరిధిలోని దివ్యాంగులు, అనారోగ్యం వల్ల మంచంపై ఉన్నవారు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు సరుకులను వారి ఇంటి వద్దే డీలర్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

షాపులు.. కార్డులు

- గుంటూరు జిల్లాలో 972 రేషన్ షాపుల పరిధిలో 5,89,531 కార్డులు ఉన్నాయి. ఎన్‌ఎఫ్ఎస్ఏ పథకం కింద ఏఏవై కార్డులు 22,862, పీహెచ్‌హెచ్ కార్డులు 49,869, రాష్ట్ర ప్రభుత్వ పథకం కింద 512 ఏఏవై, పీహెచ్‌హెచ్ 4,05,072 కార్డులు ఉన్నాయి.
- పల్నాడు జిల్లాలో 6,34,893 కార్డులు ఉండగా వీటిలో జాతీయ ఆహార భద్రత పథకం(ఎన్ఎఫ్ఎస్ఏ) కింద అంత్యోదయ అన్న యోజన (ఏఏంవై) కార్డులు 28,898, ప్రాధాన్య గృహ (పీహెచ్‌హెచ్) కార్డులు 1,70,974 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఏఏవై కార్డులు 646, పీహెచ్‌హెచ్ కార్డులు 4,34,375 కార్డులు ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో 1123 రేషన్ షాపులు పరిధిలో 4,76,529 కార్డులు ఉన్నాయి. ఏఏవై కార్డులు 20,784, పీహెచ్‌హెచ్ కార్డులు 45,876 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పథకం కింద ఏఏవై కార్డులు 453 ఉన్నాయి.

- మరో రెండు రోజుల్లో సాగర్ గేట్లు బంద్
- 10 టీఎంసీలకు 4 టీఎంసీలకే ఆమోదం
- మరో 4 టీఎంసీల కోసం జలవనరులశాఖ వినతి
- ఇంతవరకు స్పందించని కేఆర్ఎంబీ వర్గాలు



30 వరకే తాగునీటి విడుదల

నరసరావుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నుంచి తాగు నీటి అవసరాల కోసం కుడి కాల్వకు నీటి సరఫరా 30వ తేదీ వరకు మాత్రమే జరగనున్నది. ఆ తర్వాత డ్యాం నుంచి నీరు ఆగిపోనున్నది. ఈ నెల 22 నుంచి రోజూ 5,598 క్యూసెక్కులను డ్యాం నుంచి విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. 30వ తేదీ అర్ధరాత్రి వరకు నీటి విడుదల జరగనున్నది. ఆ తర్వాత జలాశయం గేట్లు బంద్ చేసి నీటి విడుదలను ఆపేయనున్నారు. కుడి కాల్వ పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీలు కేటాయించా లని జలవనరుల శాఖ కేఆర్ఎంబీని కోరింది. అయితే కేఆర్ఎంబీ 4 టీఎంసీల నీటిని మాత్రమే కేటాయించిన విషయం తెలిసిందే. కనీసం మరో 4 టీఎంసీలు కేటాయించాలని ఉన్నతాధికారులు కేఆర్ఎంబీని కోరారు. అదనపు కేటాయింపులపై మంగళవారం రాత్రి వరకు కేఆర్ఎంబీ వర్గాల నుంచి స్పందన రాలేదు. ఈ పరిస్థి తుల్లో కుడి కాల్వ పరిధిలోని చెరువులను నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ శాఖల అధికారులను ఎస్ఈ కృష్ణమోహన్ కోరారు. డ్యాం నుంచి 30న నీటి సరఫరా నిలిపివేసినా బుగ్గవాగు నుంచి మరో రెండు రోజులు సరఫరా జరిగే అవకాశం ఉంది. మేజర్ కాల్వ నుంచి మైనర్లు, సబ్ మైనర్లకు నీటి సరఫరా చేసే తూములకు షట్టర్లు లేకపోవడంతో తాగు నీరు వృథా అవుతోంది. వచ్చే సీజన్‌కు అయినా షట్టర్లు ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టేందుకు జలవనరుల శాఖ చర్యలు చేపట్టాలి.

నేడు ఉండవల్లిలో యోగాంధ్ర క్యాంపెయిన్

స్థల పరిశీలన చేసిన ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ




ఉండవల్లి గుహల వద్ద స్థల పరిశీలన చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ, కమిషనర్ అలీంబాషా తదితరులు

తాడేపల్లి, మే 27 (ఆంధ్ర జ్యోతి): యోగాంధ్ర-2025 క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం తాడే పల్లి పరిధిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాపై అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. ఇందుకు సంబంధించి స్థల పరిశీలన, ఏర్పాట్లలో భాగంగా మంగళవారం ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ అలీంబాషాతో కలిసి ఉండవల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఉండవల్లి గుహల వద్ద కొండలపైన చదును ప్రదేశంలో దాదాపు 200 మందితో యోగా అవగాహనా కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. శిక్షకులతో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. యోగాపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు జూన్ 21న యోగా దినోత్సవంలో పాల్గొనే ఆసక్తి ఉన్న వారు యోగాంధ్ర వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీ మెప్మా టి.విజయలక్ష్మి, జిల్లా టూరిజం ఆఫీసర్ శ్రీరమ్య, ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ అనిత, ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ జీ.శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, తహసీల్దార్ సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో ర్యాలీ..

గుంటూరు కార్పొరేషన్: యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్‌థెరిస్సా విగ్రహం వరకు అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ ప్రారంభించారు. అనంతరం నగపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యోగా శిక్షకులను గుర్తించి, వారి ద్వారా క్షేత్ర స్థాయి వరకు యోగాపై ప్రజలకు తెలియచేస్తామన్నారు. మంగళగిరి ఎకో పార్క్‌లో కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జూన్ 21 జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా చేయడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డీపీవో డాక్టర్ సైమన్, డీపీఎం(ఇంచార్జ్) ఎస్ఆర్‌హెచ్ఎం డాక్టర్ జయరామకృష్ణ, డెమో జయప్రసాద్, డిప్యూటీ డెమో ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



హడావుడిగా.. పునర్విభజన

- హెల్త్ అసిస్టెంట్ల రీడిప్లాయ్మెంట్‌లో వసూళ్లు
- మెయిల్‌లో రాత్రి ఆదేశాలు.. ఉదయం కౌన్సెలింగ్
- 22 ఏళ్లుగా ఒకే చోట ఉన్న వారిని తిరిగి కొనసాగింపు



గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం

గుంటూరు సిటీ, మే 27(ఆంధ్ర జ్యోతి): అవినీతి.. అక్రమాలు.. మామూళ్లు ఇచ్చిన వారిని బదిలీ చేయకుండా కొనసాగింపు.. ఇదీ హెల్త్ అసిస్టెంట్ల(మేల్) పునర్విభజన(రీడిప్లాయ్మెంట్) ప్రక్రియ సాగిన తీరు. రీడిప్లాయ్మెంట్ ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు గుంటూరు వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి సోమవారం రాత్రి 9.30 గంటలకు ఆరోగ్య కేంద్రాలకు మెయిల్ పంపారు. కనీసం ఒక్క రోజు కూడా గడువు ఇవ్వకుండా హెల్త్ అసిస్టెంట్లను గుంటూరుకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఆరోగ్య శాఖ మంత్రి చెప్పిన మాటలకు ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు సమాధి కట్టారు. ముడుపులు ముట్టిన నేపథ్యంలోనే ఈ రీడిప్లాయ్మెంట్ ప్రక్రియలో సుమారు 70 మంది హెల్త్ అసిస్టెంట్ల పేర్లు లేకుండానే జాబితాను వెలువరించడం వివాదాస్పదమవు తుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న సుమారు 177 మంది హెల్త్ అసిస్టెంట్లను మలేరియా సంబంధిత పనుల్లో నియమించాలని నెల క్రితం రాష్ట్ర అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే అప్పటి నుంచి మౌనంగా ఉన్న జిల్లా అధికారులు సోమవారం రాత్రి నుంచి హడావిడి చేశారు.

వారి పేర్లు లేవు...

రెండేళ్ల క్రితం 143 జీవో పరిధిలోని హెల్త్ అసిస్టెంట్ల (మేల్) రీడిప్లాయ్మెంట్ ప్రక్రియ జరిగింది. అప్పట్లో జిల్లాకు చెందిన మంత్రి చెప్పారని సుమారు 40 మందికి పట్టణ ప్రాంతంలో పోస్టింగ్ ఇచ్చి గ్రామీణ ప్రాంతాల్లోని వారికి అన్యాయం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మలేరియా, ఫైలేరియా విభాగంలో పని చేసే సుమారు 70 మంది హెల్త్ అసిస్టెంట్లు పట్టణ ప్రాంతాల్లోనే పనిచేస్తూ వ్యాపారాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా జరిగిన రీడిప్లాయ్మెంట్‌లో కూడా ఆ 70 మంది పేర్లు లేకుండానే జాబితాను రూపొందించారని హెల్త్ అసిస్టెంట్లు ఆరోపిస్తున్నారు.

జాబితాలో పలుమార్లు మార్పులు..

ఒకే రోజులో సీనియార్టీ జాబితాను గుంటూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలోని మినిస్టీరియల్ సిబ్బంది పలుమార్లు మార్పులు చేశారని సమాచారం. ఆ మార్పుల వల్ల మొదటి జాబితాలో 20వ స్థానంలో ఉన్న వ్యక్తి రెండో జాబితాలో 60వ స్థానంలోకి వెళ్లినట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో నగదు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి.

రీడిప్లాయ్మెంట్‌ను రద్దు చేయాలి

హడావిడి రీడిప్లాయ్మెంట్‌లో అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. ఇష్టానుసారంగా చేస్తే అభ్యర్థులు నేతల నుంచి ఒత్తిడి చేయిస్తారని ప్రస్తుతం వారు అందుబాటులో లేని సమయంలో హడావిడి చేశారు. కార్యాలయంలో జాబితా సక్రమంగా రూపొందించే సిబ్బందే లేరు. రీడిప్లాయ్మెంట్ ప్రక్రియలో కొందరిని ఎందుకు మినహాయించారో చెప్పాలి. ఈ ప్రక్రియను రద్దు చేసి పారదర్శకంగా చేపట్టాలి.



-ఎం భానుమూర్తి, తెలుగు నాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు



నేనూ దళితురాలినే.. అన్యాయం చేస్తారా!

● రౌడీషీటర్లకు అండగా నిలవమని అంబేద్కర్ చెప్పలేదు
● దళిత సంఘాలు, రాజకీయ నాయకుల్లారా ఆలోచించండి
● కానిస్టేబుల్ చిరంజీవి భార్య అభ్యర్థన వీడియో


నాకు అన్యాయం చెయ్యొద్దంటూ వేడుకుంటున్న కానిస్టేబుల్ చిరంజీవి భార్య కళ్యాణి

తెనాలి, మే 27, (ఆంధ్రజ్యోతి): 'దళిత సంఘ పెద్దలను, రాజకీయ నాయకులను ఒక దళిత సోదరిగా వేడుకుంటున్నా. పోలీసులు రౌడీషీటర్లను దండించిన సంఘటనలో అమాయకపు దళితులకు అన్యాయం జరిగిందంటూ దళిత సంఘాలు, రాజకీయ పెద్దలు వారికి అండగా నిలబడేందుకు ముందుకు రావటం బాధ కలిగించింది. అయ్యా... ఒక్కసారి నా అభ్యర్థన వినండి. ఒక్క క్షణం ఆలోచించండంటూ' కానిస్టేబుల్ చిరంజీవి భార్య కళ్యాణి మాట్లాడిన వీడియో సాంఘిక మాధ్యమాలో ప్రత్యక్షమయింది. ఇదే వీడియోను ఆమె మంగళవారం రాత్రి మీడియాకు పంపారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఓ కానిస్టేబుల్‌పై దాడిచేసిన కేసులో ముగ్గురు యువకులను నడి రోడ్డుపై కూర్చోబెట్టి పోలీసులు లాఠీలతో దండించిన సంఘటనకు సంబంధించిన వీడియో సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. నెల క్రితం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోమవారం సాంఘిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయిన సంగతి తెలిసిందే. అయితే దీనిపై దళిత సంఘాలు మండిపడ్డాయి. పోలీసులు దారుణంగా వ్యవహరించారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ సోషల్ మీడియా వేదికగా పట్టుబడుతూ వచ్చాయి. మరోపక్క వైసీపీ మాజీ మంత్రి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లు కూడా ఈ చర్యను ఖండిస్తూ ఆందోళనకు సిద్ధమంటూ విలేకరుల సమావేశం పెట్టి ప్రకటించారు. ఈ నేపథ్యంలో రైడీషీటర్ల దాడికి సంబంధించి బాధితుడు చిరంజీవి భార్య కళ్యాణి వీరి డిమాండ్లపై ప్రతిస్పందిస్తూ ఒక వీడియోను విడుదల చేశారు. తాను కూడా దళిత మహిళనేనని, తల్లి, తండ్రి లేరని, బీసీ సామాజిక వర్గానికి చెందిన చిరంజీవిని పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నానని, నన్ను, నా పిల్లలను బాగా చూసుకుంటారని వీడియోలో పేర్కొన్నారు. ఐతానగర్‌లో నా దళితులంతా ఉన్నారని, నాకు అండగా ఉంటారనే ధైర్యంతో నివాసం ఉంటే, నా భర్త కానిస్టేబుల్ అయినప్పటికీ రౌడీ షీటర్లు మారణాయుధాలతో ఇటీవల దాడిచేసి చంపబోతే, మేము కేసు పెట్టామని, ఆ కేసులో దాడికి పాల్పడిన దళితులను పోలీసులు పట్టుకుని దండిస్తే నా సామాజిక వర్గానికి చెందిన సంఘాలే దానిని వ్యతిరేకించి, రౌడీ షీటర్‌లకు అండగా నిలవటం బాధ కలిగించిందని కన్నీటి పర్యంతమయ్యారు. నేను బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంటే దళితురాలిని కాకుండా పోతానా? ఆనాడు నా భర్తపై దాడి జరిగితే ఈ సంఘాల నాయకులు, రాజకీయ పెద్దలు ఎందుకు రాలేదని, నాకు అండగా నిలిస్తే నిజమైన దళితుల తరపున నిలిచినవారయ్యేవారన్నారు. వారు దాడి చేసిన సమయంలో నా భర్తకు ఏదైనా జరిగితే నేను, నా పిల్లలు ఏమయ్యేవారని ప్రశ్నించారు. అంబేద్కర్ కూడా రైడీషీటర్‌లను ప్రోత్సహించమని చెప్పలేదని, నిజమైన అమాయకపు దళితులకు అన్యాయం జరిగుంటే వచ్చి పోరాటం చెయ్యాలని, రౌడీషీటర్‌లకు, మానవ మృగాలకు మద్దతు ఇవ్వవద్దని, దయచేసి రౌడీ షీటర్‌లను ప్రోత్సహించవద్దంటూ వీడియోలో వేడుకున్నారు. ఒక దళిత సోదరిగా వేడుకుంటున్నానని, మీరంతా నాకు అండగా నిలవాలని, రాజకీయ పెద్దలారా దీనిని రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృష్టితో చూడాలని, మీ అందరికీ వారి నేర చరిత్ర తెలిసి కూడా అండగా నిలవాలని చూస్తే నా వంటి దళిత సోదరి అన్యాయం అయిపోతుందనేది గుర్తించాలంటూ వేడుకున్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


కొనకంచి శ్రీనివారావు(ఫైల్)

మాచవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నెల్లి గ్రామ కౌలు రైతు.. అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మాచవరం ఎస్‌ఐ ఎం.రోశయ్య తెలిపిన వివరాలు మేరకు.. పిన్నెల్లి గ్రామానికి చెందిన కొనకంచి శ్రీనివాసరావు(47) తన ఎకరం పొలంతో పాటు.. తమ్ముడు పొలం ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పంటలు పండితే ధర లేక, ధరలు ఉంటే దిగుబడి లేక.. సాగు కోసం సుమారు రూ.15 లక్షల వరకు అప్పులు చేశారు. బ్యాంకులో పంట రుణం రూ.1.50 లక్షలు, బంగారం రుణం రూ.2.50 లక్షలు తీసుకున్నారు. ఇలా అప్పులు పెరగడంతో.. అప్పు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక ఉన్న ఎకరం పొలం రూ.13 లక్షలకు విక్రయించాడు. పొలం కొన్న వారు రూ.11 లక్షలు ఇచ్చారు. అయినా.. అప్పులు తీర లేదు. దీంతో మనో వేదనకు గురైన శ్రీనివాసరావు రాత్రి బయటకు వెళ్లి వస్తానంటూ చెప్పి బయటకు వెళ్లాడు. ఇంతలోనే గొర్రెల కాపరులు శ్రీనివాసరావు పొలంలో పురుగు మందు తాగి స్పృహ లేకుండా పడి పోయి ఉన్నాడని సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొనే సరికే మృతి చెంది ఉన్నాడు. భార్య అంజలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రోశయ్య కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి పిల్లలు ఉన్నారు.

తమ్ముడి కొడుకును చంపిన.. అన్నకు జీవిత ఖైదు

ఈపూరు, మే27(ఆంధ్రజ్యోతి): తమ్ముడి కొడుకు మీద పెట్రోలు పోసి నిప్పు అంటించి చావుకు కారణమైన ముద్దాయి నాశన పెదకొండయ్యకు జీవిత ఖైదు, రూ.10వేలు జరిమానా విధిస్తూ నరసరావుపేట 13వ అడిషనల్ జడ్జి కోర్టు మంగళవారం తీర్పు ఇచ్చిందని ఎస్‌ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈపూరు మండలం కూచినపల్లికి చెందిన నాశన పెదకొండయ్య, చిన కొండయ్య అన్నదమ్ములు. ఆస్తి కోసం 2019 అక్టోబర్ 17న ఇద్దరూ గొడవపడ్డారు. గొడవ జరుగుతుండగా చిన కొండయ్య రెండవ కొడుకు రాకేష్ ఇద్దరికీ సర్ది చెప్పాడు. అయితే రాకేష్‌పై పెదకొండయ్య కక్ష పెంచుకున్నాడు. అదే రోజు రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న రాకేష్‌పై పెదకొండయ్య పెట్రోలు పోసి నిప్పు అంటించాడు. మంటల్లో చిక్కుకున్న రాకేష్ కేకలు వేయడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు మంటలు ఆర్పారు. నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాకేష్ మరణ వాంగ్మూలం ప్రకారం అప్పటి ఎస్‌ఐ ఐ.అస్సాన్ కేసు నమోదు చేశారు. వినుకొండరూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు విచారణ పూర్తి చేసి.. కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. వినుకొండ రూరల్ ప్రస్తుత సీఐ బి.ప్రభాకర్, ఈపూరు ఎస్‌ఐ ఎం.ఉమామహేశ్వరరావు సాక్ష్యాలను ప్రవేశపెట్టగా రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు, ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి వాదనలు వినిపించారు. ముద్దాయి నాశన పెదకొండయ్యకు జడ్జి ఎస్.సత్య శ్రీ 302 సెక్షన్ ప్రకారం జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

పంతులమ్మలా సిబ్బందికి ఎంపీడీవో పనిష్మెంట్

సమయపాలన పాటించని వారిని గేటు బయట నిలబెట్టిన వైనం

ప్రత్తిపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో శివ పార్వతి తీరు ఇటీవల ఉద్యోగులకు తలనొప్పిగా మారింది. అటు పంచాయతీ సెక్రటరీల నుండి ఇటు అన్ని శాఖల అధికారుల్లో కూడా ఆమె తీరు పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆ అసంతృప్తి ఇప్పుడు యోగా శిక్షణ కార్యక్రమంలో కూడా బయటపడింది. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో టీవోటీలకు నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం కొందరు మండల స్థాయి అధికారులతో పాటు సిబ్బంది ఆలస్యంగా శిక్షణకు హాజరయ్యారు. దీంతో ఎంపీడీఓ గేటు బయట కుర్చీ వేసుకుని కూర్చున్నారు. ఆలస్యంగా వచ్చే పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలతో పాటు ఇతర శాఖల అధికారులను బయటే నిలబెట్టేశారు. ఇంకా రాని మండల స్థాయి అధికారులపై జిల్లా అధికారులకు ఫోన్ చేసి, ఫిర్యాదు చేశారు. గేటు బయట అధికారులను నిలబెట్టడం ఇప్పుడు మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. స్కూలు పిల్లలను నిలబెట్టినట్లు తమను ఎంపీడీవో బయట నిలబెట్టడం ఏమిటంటూ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఉద్యోగులు అయితే సిగ్గుతో తలదించుకున్నామని చెప్తున్నారు.

రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం


రామకృష్ణకు పట్టా అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు

పెదకాకాని, మే 27(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్ మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో పరిశోధన చేసినందుకు పాలడుగు రామకృష్ణకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ మంగళవారం తెలిపారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. గంగాధరరావు పర్యవేక్షణలో " టెక్స్ క్లస్టరింగ్ అండ్ డాక్యుమెంట్ క్లాసిఫికేషన్ టెక్నిక్స్ యూజింగ్ డీప్ కాంటెక్స్‌వల్ అండ్ ఎక్స్ టెన్ డెడ్ గ్లోవ్ మెథడ్ " అనే అంశంపై రామకృష్ణ పరిశోధన గ్రంథం సమర్పించారు. వీసీ చేతుల మీదుగా పట్టా అందుకున్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో..

ఏఎన్‌యూకు ర్యాంకులు

పెదకాకాని, మే 27(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ది వీక్ - హన్సా రీసెర్చ్ బెస్ట్ యూనివర్సిటీ సర్వే - 2025 ర్యాంకింగ్స్ విడుదల చేసింది. మల్టీ డిసిప్లినరీ వర్సిటీ కేటగిరిలో జాతీయస్థాయిలో ఏఎన్‌యూ 13, సౌత్ జోన్ స్థాయిలో 6, రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకులను కైవసం చేసుకుంది. మౌలిక వసతులు, మేధావులపై అధ్యాపకులు, పరిశోధన, అకడమిక్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్ అడ్మిషన్స్, ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్, ప్లేస్మెంట్స్ ఆధారంగా ఈ ర్యాంకులను కేటాయించడం జరిగింది. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది కృషి వల్లే ఈ ర్యాంకులు వర్సిటీకి సాధ్యమైనట్లు తాత్కాలిక వీసీ ఆచార్య కె.గంగాధరరావు మంగళవారం తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్, యూకే ఆధ్వర్యంలో ప్రకటించిన ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ - 2025లో ఏఎన్‌యూ అంతర్జాతీయంగా బ్యాండ్ 600 + ర్యాంక్‌ని సొంతం చేసుకుంది. అభ్యాసన వాతావరణం, పరిశోధన వాతావరణం, నాణ్యత, శ్రేష్ఠత, అంతర్జాతీయ దృక్పథం, పరిశ్రమలను పరిశీలించి ర్యాంక్ లను విడుదల చేసింది. రిజిస్ట్రార్ జి.సింహాచలం, డాక్టర్ రవి, ఆర్కిటెక్చర్ కళాశాల బోధనా సిబ్బంది ఉన్నారు.


ర్యాంకులు చూపుతున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

బర్లీ పొగాకు మొత్తం కొనుగోలు చేయాలి

● ప్రభుత్వం కొన్నా రూ.50 కోట్లు దాటదు
● రైతు సంఘాల సమన్వయ సమితి నిరసన దీక్షలు

చిలకలూరిపేట, మే27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరు జిల్లాల పరిధిలో రైతుల నుండి నల్ల బర్లీ పొగాకును తక్షణం కొనుగోలు చేయాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు డిమాండ్ చేశారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఐటీసీ కంపెనీ ఎదుట మంగళవారం పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్షలు జరిగాయి. దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం డాక్టర్ కొల్లా మాట్లాడుతూ మంత్రుల సమక్షంలో పొగాకు కంపెనీలు అంగీకరించిన విధంగా కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మూడుసార్లు కంపెనీలతో సమావేశాలు జరిగినా ఫలితాలు కనిపించలేదని పేర్కొన్నారు. రైతులకు కంపెనీలు గిట్టుబాటు ధర చెల్లించి, పొగాకును కొనుగోలు చేయని పక్షంలో ప్రభుత్వం పూనుకొని మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన కోరారు. పొగాకు బోర్డు పరిధిలోకి బర్లీ పొగాకును చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పొగాకు రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. రైతుల నుండి పొగాకు కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. రైతు రుణ మాఫీ చేయమని ఎన్నిసార్లు విన్నవించినా.. కేంద్రానికి కార్పొరేట్ వ్యక్తుల మీద ఉన్న ప్రేమాభిమానాలు రైతులపై లేదని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు రు.60 లక్షల కోట్లు రుణమాఫీ సబ్సిడీలు ఇచ్చారని దుయ్యబట్టారు.

మొత్తం కొన్నా..రూ.50 కోట్లు దాటదు..

కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ కడపలో జరుగుతున్న మహానాడులో వ్యవసాయ పంటల ధరలపై తీర్మానం చేయాలన్నారు. పల్నాడు జిల్లాలో ఐదు వేల ఎకరాల్లో పొగాకు సాగు చేశారని, 50 వేల క్వింటాళ్లు పొగాకు పండిందన్నారు. ఈ మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేసినా రూ.50 కోట్లు ఖర్చు దాటదన్నారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఏపూరి గోపాలరావు, రాష్ట్ర కార్యదర్శి కేవీపీ ప్రసాద్, సీపీఐ జిల్లా సెక్రటరీ మారుతీ వరప్రసాద్, సుబాబుల్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమాన్ రెడ్డి, పలు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ వ్యవసాయశాఖ మంత్రి ఎదుట అంగికరించిన విధంగా కంపెనీలు పొగాకును క్వింటా రూ.15 వేలకు తక్కువ కాకుండా కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పొగాకు కంపెనీలు, ప్రభుత్వం దిగివచ్చేంత వరకు ఉద్యమం చేస్తామని తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లా రైతులు అధిక సంఖ్యలో నిరసన దీక్షలో పాల్గొన్నారు. పలు సంఘాల నాయకులు నిరసన దీక్షలో పాల్గొన్నారు. పొగాకు రైతుల నిరసన దీక్ష బుధవారం కూడా కొనసాగుతుందని రైతు సంఘాల నేతలు ప్రకటించారు.


నిరసన దీక్షలో పాల్గొన్న రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు

తిరుపతికి కొత్త రైలు ప్రతిపాదించాం

● రైల్వేబోర్డు ఇంకా నిర్ణయం తీసుకోలేదు
● డీఆర్‌యూసీసీ సమావేశంలో గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్


డీఆర్‌యూసీసీ సమావేశంలో పాల్గొన్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ - న్యూ పిడుగురాళ్ల - శావల్యాపురం మీదగా తిరుపతికి ఒక కొత్త రైలు ప్రవేశపెట్టాలని రైల్వే బోర్డుకు ప్రతిపాదించామని గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్ తెలిపారు. మంగళవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో డివిజనల్ రైల్వే యూజర్స్ కన్‌సల్‌టేటివ్ కమిటీ(డీఆర్‌యూసీసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ కొత్త రైలు ప్రతిపాదనపై ఇంకా రైల్వే బోర్డు నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. అలానే కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ని డైలీ సర్వీసు చేసేందుకు ఐఆర్‌టీటీసీకి ప్రతిపాదించామన్నారు. గుంటూరు - నంద్యాల సెక్షన్‌లో ఇంటర్‌సిటీ రైలుని నడిపే విషయాన్ని డబ్లింగ్ పనులు పూర్తి అయిన తర్వాత పరిశీలిస్తామని చెప్పారు. మంగళవారం నుంచి 17261/17262 గుంటూరు - తిరుపతి - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లకు నాలుగో జనరల్ బోగి జోడించినట్లు తెలిపారు. కరోనకు ముందు నిలిపేసిన రైళ్లన్నింటిని పట్టాలెక్కించామని, 56503 /56504 బెంగళూరు కంటోన్మెంట్ - విజయవాడ - బెంగళూరు కంటోన్మెంట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మాత్రం దక్షిణ పశ్చిమ రైల్వే ఇంకా పునః ప్రారంభించలేదని తెలిపారు. గుంటూరు యార్డు రీమోడలింగ్ తర్వాత నంద్యాల వైపు నుంచి వచ్చే రైళ్లను జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కి కనెక్టింగ్ చేసే ప్రతిపాదనని పరిశీలిస్తామన్నారు.

కొత్త జడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడిగా నారాయణరెడ్డి..

జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటీ నూతన సభ్యుడిగా డీఆర్‌యూసీసీ మెంబర్ జీవీ నారాయణరెడ్డిని సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సమావేశంలో రైల్వే సీనియర్ అధికారులు డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్, జె.శ్రీనాథ్, జేవీ అనూష, జి.సూర్యనారాయణ, నోయల్, రత్నాకర్, ఎం రవికిరణ్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

➡ లేడీ టెలికాలర్స్ కావలెను : Salary : 10-20K + Incentives, Contact : Star Associates, Sattenapalli, Ph No: 77803 20276, Interview Date : 29/05/25. AJG-239055

➡ ఆఫీసు అసిస్టెంట్ : బీకాం, 3 సం॥లు అనుభవం, తెలుగు, ఇంగ్లీష్ భాషల పై పరిజ్ఞానం, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్, రెజ్యూములను hoadvtjobs@gmail.com కు పంపగలరు. KA - 211

➡ గుంటూరులోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు 20 సంవత్సరాల లోపు వయస్సు గల ఆఫీస్ బాయ్, 30 సంవత్సరాల లోపు వయస్సు గల కార్ డ్రైవర్, మరియు 25 సంవత్సరాల లోపు వయస్సు గల పనిమనిషి కావలెను. సంప్ర॥ 9703777458 AJG-238760

➡ కొటక్ బ్యాంక్ అనుబంధ సంస్థలో పని చేయుటకు Rtd, VRS, NRI, హౌస్ వైఫ్స్, బిజినెస్ పర్సన్స్ కావలెను. మెడికల్ బెనిఫిట్స్ & శాలరీ, సంప్ర॥ 70134 81406. AAA-10010

➡ గుంటూరు సిటీలోని ప్రముఖ విద్యాసంస్థ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. డ్యూటీ 12 గంటలు, భోజన వసతి కలదు. గుంటూరు సిటీలోని వారికి ప్రాధాన్యత. సంప్ర॥ 9989893331, 9951345285. RK-2244

➡ ఇన్సూరెన్స్ ఏజంట్స్ & మార్కెటింగ్ వారికి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. క్రొత్త యూనిట్‌లో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా కావలెను. బ్యాంక్ అనుబంధ సంస్థలో వ:25-60 సం.లు. ✆ 90524 70111 AJB-75

FLAT FOR SALE

➡ గుంటూరు గుజ్జనగుండ్ల పెద్ద పలకలూరు రోడ్డు కరెంట్ ఆఫీస్ Opp. రోడ్డులో సాయికృష్ణ నగర్ 3వ లైన్‌లో శ్రీ సాయి కృష్ణ ఆర్కిడ్ లో 3 BHK ఇండిపెండెంట్ 5 ఫ్లాట్స్. Each flat - 2313 Sft, తూర్పు ఫేసింగ్ ఫుల్ ఫినిష్డ్ ఫ్లాట్ అమ్మబడును. ఫోన్ : 98494 70552, 91103 80983. RK-2255

రియల్ ఎస్టేట్

➡ ప్రతి నెలా రెంటల్ ఇన్‌కమ్ వచ్చే విధంగా తిరుపతిలో సర్వీసు అపార్ట్‌మెంట్స్ డిజైన్ చేయబడినవి. సంప్రదించండి సెల్ నెం. 99088 22077 AJG-239169

EDUCATION

➡ నర్సింగ్ (Girls), MLT, వెటర్నరీ, అగ్రికల్చర్, ఫిజియోథెరఫీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. బాల బాలికలు హాస్టల్ వసతి కలదు. M.S.M. College, Guntur. 73867 06839, 77804 94333 RK-2253

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➡ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999 AJB-235096

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ రుణాలపై సీబీఐ విచారణ జరపాలి

● డీసీసీబీ కార్యాలయం ఎదుట ఉద్యోగ సంఘాల నాయకుల నిరసన


బ్యాంకు ఎదుట నిరసన తెలియజేస్తూ నినాదాలు చేస్తున్న అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు

గుంటూరు, మే 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచీల్లో జరిగిన అక్రమ రుణాలపై సీబీఐతో విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీ సీసీబీఈఏ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.శివకృష్ణ డిమాండ్ చేశారు. అక్రమ రుణాలు పొందిన వారు, సహకరించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్యమేవ జయతే పేరుతో ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. తొలి రోజు మంగళవారం గుంటూరు బ్రాడీపేటలోని కేంద్ర సహకార బ్యాంకు ఎదుట ఉద్యోగులు బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో జిల్లాలోని ఏడు బ్రాంచీల పరిధిలోని సహకార సంఘాల ద్వారా కొందరు అక్రమార్కులు ఉద్దేశపూర్వకంగా నకిలీ పాస్ పుస్తకాలు, రెవెన్యూ రికార్డులు సృష్టించి, వాటితో రూ. 11 కోట్లు అక్రమ రుణాలు పొందినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్లుగా వీటిపై విచారణలు లేవన్నారు. పైగా మోసానికి బ్యాంకు ఉద్యోగులను సహకార అధికారులు సెక్షన్ 51 ప్రకారం విచారణ, నివేదిక పేరుతో అన్యాయంగా బాధ్యులను చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వీటిపై అనేక దఫాలుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఫలితం లేకుండాపోయిందన్నారు. జిల్లా కార్యదర్శి రమేష్‌బాబురెడ్డి మాట్లాడుతూ ఈ నెల 31 వరకు ఉద్యోగులు బ్యాడ్జీలతో నిరసన చేస్తారని, జూన్ 2 నుంచి 5వ తేదీ వరకు బ్రాంచ్‌ల ఎదుట మధ్యాహ్నం నిరసన ప్రదర్శనలు, జూన్ 6న పెన్ డౌన్ కార్యక్రమం, 9న కేంద్ర కార్యాలయం ఎదుట ధర్నా, 10న గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో అసోసియేషన్ ట్రెజరర్ పి.లక్ష్మీనారాయణ పలువురు నాయకులున్నారు.



సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ళ	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	98852 71281
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వరంగ సంస్థ

అసెట్ రికవరీ శాఖ #249/3RT, మొదటి అంతస్థు, S.R.నగర్ మెయిన్ రోడ్, హైదరాబాద్-500038

ఇ.-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8 క్రింద నిబంధనలు చూడగలరు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ చార్జ్‌చేయబడినట్టి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారి ద్వారా లాంఛనప్రాయ/ వాస్తవిక స్వాధీనం చేసుకొనబడినట్టి దిగువ వివరించబడిన స్థిరాస్తులు దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) & హామీదారు(ల) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావలసిన దిగువ తెలిపిన బకాయిలు రాబట్టుకొనుటకు, దిగువ తెలిపిన తేదీన "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏమి ఉంటే అదే" మరియు "ఏది అక్కడ ఉంటో అదే" ప్రాతిపదికన విక్రయించబడునని ముఖ్యంగా రుణగ్రహీత(ల)కు మరియు హామీదారు(ల)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. రిజర్వు ధర మరియు బయానా కూడా దిగువ తెలియజేయబడినవి:

రుణగ్రహీత పేరు మరియు చిరునామా: 1) మెసర్స్ ధన్య & కో, డి.నం.7/1, పెరుమాళ్ల స్ట్రీట్, కంకిపాడు, కృష్ణా జిల్లా-521151. మరియు 2) ఫ్లాట్ నం.112 వీఆర్ అపార్ట్‌మెంట్స్, ఎన్‌హెచ్ 16 సర్వీస్ రోడ్, తాడేపల్లి, గుంటూరు-522501. మరియు 3) ఫ్లాట్ నం.103, ఐఎఫ్ మలేషియన్ టౌన్‌షిప్, 4వ ఫేజ్, బ్లాక్ నం.21, కెపిహెచ్‌బి కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్-500072. మరియు హామీదారులు : 4) శ్రీ రత్నం కిషోర్ చిన్నం, ఫ్లాట్ నం.103, ఐఎఫ్ మలేషియన్ టౌన్‌షిప్, 4వ ఫేజ్, బ్లాక్ నం.21, కెపిహెచ్‌బి కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్-500072. 5) శ్రీమతి చిన్నం స్వాతి, ఫ్లాట్ నం.103, ఐఎఫ్ మలేషియన్ టౌన్‌షిప్, 4వ ఫేజ్, బ్లాక్ నం.21, కెపిహెచ్‌బి కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్-500072. 6) మారెళ్ల శ్రీనివాస రెడ్డి, ఫ్లాట్ నం.502, శ్రీ బాలాజీ రెసిడెన్సీ, ఇం.నం.13-1-217/1, స్పెన్సర్ సూపర్ మార్కెట్ సమీపాన, మోతీ నగర్, సనత్‌నగర్, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500018.

సదరు స్థిర సెక్యూర్డ్ ఆస్తిని విక్రయించి రాబట్టుకొనవలసిన బకాయి మొత్తాలు: 31.03.2025 నాటికి రూ.4,00,45,084.42 (రూపాయలు నాలుగు కోట్ల నలభై ఐదు వేల ఎనభై నాలుగు మరియు నలభై రెండు పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ మరియు వ్యయాలు.

విక్రయించబోయే స్థిర సెక్యూర్డ్ ఆస్తుల వివరణ:

గుంటూరు జిల్లా, మంగళగిరి, తాడేపల్లి గ్రామ పంచాయతీ, సర్వే నం.117/1, 117/2, 117 & 117/ఏ వద్ద గల 32 చ.గజాలు అవిభాజ్య వాటాతో, మణిపాల్ హాస్పిటల్ ప్రక్కన, ఎన్‌హెచ్ 16 సర్వీస్ రోడ్, వజ్ర రెసిడెన్సీ, గ్రౌండ్ ఫ్లోర్, ఇ-బ్లాక్, 1536.00 చ.గజాలు కార్పెట్ ఏరియాతో ఇ-బ్లాక్ (స్టార్), డి.నం.12-459/2, నివాసిత ఫ్లాట్ నం.112. సరిహద్దులు: ఉత్తరం: ఫ్లాట్ నం.111, దక్షిణం: ఖాళీ, తూర్పు: ఖాళీ, పశ్చిమం: ఫ్లాట్ నం.101& కామన్ కారిడార్.
ఎస్ఆర్‌వో మంగళగిరి వద్ద నమోదైన సమోదిత సేల్ డీడ్ నం. 16060/2015 తేది 30.11.2015.
ఎస్ఆర్‌వో మంగళగిరి, ఫ్లాట్ సరిహద్దుల కొరకు రెక్టిఫికేషన్ డీడ్ డాక్యుమెంట్ నం.8387/2018 తేది 04.04.2018.
గూగుల్ కో-ఆర్డినేట్స్: 16.4829, 80.61666

రిజర్వు ధర : రూ. 41,40,000/- బయానా : రూ. 4,14,000/- బిడ్ పెరుగుదల : రూ. 41,400/-

ఇ.-వేలం తేది మరియు సమయం: 13.06.2025 మ.12:00 గం. మరియు సా.5:00 గం. మధ్య
(10 నిమిషాల అపరిమిత ఆటో విస్తరణలతో) ఇ-వేలం వెబ్‌సైట్ - https://baanknet.com

బయానా దాఖలుకు చివరి తేది: వేలం ముగింపు సమయం కంటే ముందుగా బయానాను డిపాజిట్ చేయవలెను మరియు ఆస్తి ఐడితో బయానా మొత్తాన్ని లింక్‌చేయవలెను/ మ్యాప్ చేయవలెను. ఏదేని సాంకేతిక సమస్యను నివారించడానికి తగినంత ముందుగా ఆస్తి ఐడితో బయానా మొత్తాన్ని డిపాజిట్ చేసి, లింక్ / మ్యాప్ చేయవలసిందిగా సూచించడమైనది.

మొబైల్ నంబర్ మరియు చెల్లుబాటు గల ఇమెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com లో నమోదు చేసుకోండి. రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు https://baanknet.com లోని హోమ్‌పేజ్‌లో ఏర్పాటు చేసిన బయ్యర్ మాన్యువల్ లింక్‌ను దర్శించండి. విచారణల కొరకు సంప్రదించు నంబర్: 8291220220, ఇమెయిల్ ఐడి: support.baanknet@psballiance.com. బిడ్డర్లు వారి బిడ్లను దాఖలు చేసేముందు మరియు ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనే ముందు వేలం అమ్మకం యొక్క సవివరమైన టెండరు నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.in చూడవలసిందిగా సూచించబడుచున్నారు. ఈ బిడ్డింగ్ ప్రాసెస్ ముగిసిన తరువాత సఫలీకృత బిడ్డర్‌కు ఇమెయిల్ ద్వారా తెలియజేయబడును. ఆసక్తిగల బిడ్డరు సంప్రదించగలరు: అధీకృత అధికారి, 249/3ఆర్‌టి, 1వ అంతస్తు, మెయిన్‌రోడ్, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్ - 500038, మొబైల్ నం: 8077983839 / 9493268455

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8 క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం ప్రకటన పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీతలు మరియు హామీదారులకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 క్రింద ప్రకటనగా కూడా దీనిని పరిగణించగలరు.

తేది: 21.05.2025
ప్రదేశం: హైదరాబాద్
అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అసెట్ రికవరీ శాఖ



అభివృద్ధి పనులకు సంబంధించి పత్రాలు పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

టెండర్ పొందిన పనులను త్వరగా ప్రారంభించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో వర్షాల వలన లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా టెండర్ పొందిన పనులను త్వరగా ప్రారంభించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం విద్యా నగర్, కృష్ణ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

కమిషనర్ మాట్లాడుతూ వార్డుల వారీగా టెండర్ పొందిన పనులను జాప్యం లేకుండా జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ చేసుకోవాలన్నారు. వర్షాల వలన లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా ప్రతిపాదించిన రోడ్లు, డ్రెయిన్లను తక్షణం ప్రారంభించి, వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. నూతన బహుళ అంతస్తు భవన నిర్మాణదారులు తప్పనిసరిగా డ్రెయిన్‌ని మేజర్ డ్రెయిన్‌లోకి కనెక్ట్ చేసేలా, ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో రోజువారి చెత్త సేకరణకు ప్రజారోగ్య కార్మికులు రావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, సచివాలయం పరిధిలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ బాధ్యత శానిటేషన్ కార్యదర్శిదేనని స్పష్టం చేశారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, టీపీఎస్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

యోగాతో అందరికీ సంపూర్ణ ఆరోగ్యం

● డీపీవో నాగసాయికుమార్

గుంటూరు(తూర్పు), మే 27(ఆంధ్రజ్యోతి) : యోగాతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని జిల్లా పంచాయతీ అధికారి బి.నాగసాయికుమార్ తెలిపారు. స్థానిక గుంటూరు రూరల్ మండల కార్యాలయంలో మంగళవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగా మన ప్రాచీన సంస్కృతి అని, దీనిని అలవాటు చేసుకుంటే మానసిక ఒత్తిడి నుంచి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల రోజులు పాటు వివిధ యోగా కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్టు చెప్పారు. యోగాలో గ్రామస్థాయి ట్రైనర్లకు రెండు బ్యాచ్‌లుగా విభజించి మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. తొలి రోజు శిక్షణలో భాగంగా 81 మంది మండల సిబ్బందికి యోగా శిక్షణ తరగతులు నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, ఏవో విద్యాసాగర్, మండల విస్తరణ అధికారి కే.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న డీపీవో నాగసాయికుమార్, రూరల్ మండల ఉద్యోగులు

కర్ర సాము పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

● 9 మందికి గోల్డ్, ఐదుగురికి సిల్వర్, ముగ్గురికి బ్రాంజ్ మెడల్స్

గుంటూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కర్రసాము (సిలంబం) పోటీల్లో గుంటూరుకు చెందిన కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు అసాధారణ ప్రతిభ చూపారు. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో ఈనెల 25 నుంచి ఐదవ అంతర్జాతీయ స్థాయి కర్రసాము పోటీలు జరిగాయి. అంతర్జాతీయ సిలంబం కమిటీ ఆధ్వర్యంలో కోయంబత్తూర్‌లోని ఎస్ఎన్ఎస్ అకాడమీలో జరిగిన ఈ పోటీల్లో గుంటూరుకు చెందిన కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు 9 మంది బంగారు పథకాలు కైవసం చేసుకున్నారు. ఐదుగురు సిల్వర్, ముగ్గురు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి నిర్వాహకుడు, కోచ్ కాశీనాథ్ రెడ్డి, కోచ్‌లు సాయి సుబ్రహ్మణ్యం, విజయ్ తదితరుల వద్ద కొద్ది సంవత్సరాలుగా క్రీడాకారులు తర్ఫీదు తీసుకుంటున్నారు. ఈ పోటీల్లో బి.రమ్యశ్రీ, బి.హర్షవర్ధిని, జి.మనస్విని, వి.సంకీర్తన, వి.హంసిని, ఎన్.రేవంత్, ఎన్.వసంత్, బి.కాశీనాథ్‌రెడ్డి, బి.వెంకట సాయి గోల్డ్ మెడల్స్ సాధించారు. అదేవిధంగా కె.తన్మయ, బి.భవి, జె.షణ్ముఖ్, డి.సూర్య, డి.శ్రవంత్ సిల్వర్ మెడల్స్‌ను, పి.సహస్ర, వి.వైధిక్, ఐ.డమరకేశ్వర్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు.



మెడల్స్ సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు అన్సారీ, నాగరాజు, కోచ్‌లు కాశీనాద్‌రెడ్డి, సాయి సుబ్రహ్మణ్యం తదితరులు

ప్రతిభ గల పేద వైద్య విద్యార్థులకు చేయూత

గుంటూరు మెడికల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు వైద్య కళాశాలలో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు జీఎంసీ పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. జీఎంసీ 2021వ బ్యాచ్‌కు చెందిన ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఎనిమిది మందికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున రూ.1.20 లక్షల ట్యూషన్ ఫీజును గుంటూరు వైద్య కళాశాల 1972వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు అందజేశారు. మంగళవారం జీఎంసీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ ద్వారా నగదును వైద్య విద్యార్థులకు వారు అందజేశారు. కార్యక్రమంలో జీఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్‌తో పాటు డాక్టర్ పీవీ హనుమంతరావు, డాక్టర్ కేఎల్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి నగదు అందజేస్తున్న జీఎంసీ పూర్వ విద్యార్థులు

గోవులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

గుంటూరు(తూర్పు), మే 27 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పురస్కరించుకొని గోవుల అక్రమ రవాణాకు పాల్పడే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని జిల్లా ఉప రవాణ కమిషనర్ కే.సీతారామిరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. జూన్ 7న జరిగే బక్రీద్ సందర్భంగా పాలిచ్చే ఆవులు, ఇతర నిషిద్ధ పశువులను తరలించే వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేపడతామని స్పష్టం చేశారు. పశువులను తరలించే వారు విధిగా అనుమతి తీసుకోవాలని తెలిపారు. అనుమతి లేకుండా గోవులను అక్రమంగా రవాణ చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కృష్ణబాబు కాలనీ ఎక్స్‌టెన్షన్ మురుగుమయం

గుంటూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : రామనామ క్షేత్రం - లాలుపురం రోడ్డులోని కృష్ణబాబు కాలనీ విస్తరణ ప్రదేశంలో వర్షానికి మెయిన్‌రోడ్డు సహా అన్ని వీధుల్లోకి మురుగునీరు వచ్చి చేరుతుంది. అలానే ఖాళీ స్థలాలను కూడా మురుగునీరు ముంచెత్తుతుంది. దీంతో ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం పూర్తిగా లోపించడంతో ఎలాంటి అంటువ్యాధులు ప్రబలుతాయోనని భయాందోళనకు గురౌతున్నారు. ఇక్కడి మెయిన్ రోడ్డుని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరయ్యాయని, స్థానిక నాయకులు చెప్పడమే తప్పా ఇప్పటివరకు ఎలాంటి పనులు ప్రారంభం కాలేదని స్థానికులు చెబుతున్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తమ ప్రాంతంలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



కృష్ణబాబు కాలనీ విస్తరణ ప్రదేశంలో మురుగుమయంగా మారిన రోడ్లు, పరిసరాలు

మహానాడులో జిల్లా నేతల సందడి

● జిల్లా నుంచి భారీగా తరలి వెళ్లిన శ్రేణులు

గుంటూరు, మే 27(ఆంధ్ర జ్యోతి): కడపలో మంగళవారం మొదలైన తెలుగుదేశం పార్టీ మహానాడుకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్ల తరలి వెళ్లారు. మంగళవా రం జరిగిన ప్రారంభ కార్యక్ర మంలో గుంటూరుకు చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ముఖ్య నేతలు సందడి చేశారు.

గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, వేమూరు, తాడికొండ ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, శ్రావణ్‌కుమార్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, డేగల ప్రభాకర్, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దాసరి రాజామాస్టారు తొలి రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహానాడు వేదికపై గళం వినిపించిన ఎమ్మెల్యే నసీర్

కడపలో జరిగిన మహానాడు తొలిరోజు కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ తన గళం వినిపించారు. మైనార్టీల తలరాత మార్చింది టీడీపీనేనన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ముస్లింలు దగా పడ్డారని విమర్శించారు. మైనార్టీల ఆర్థిక ప్రగతి కూటమితోనే సాధ్యమని చెప్పారు. మైనార్టీల కోసం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన వివరించారు. మైనార్టీలంతా టీడీపీకి రుణపడి ఉంటామని, గుండెల్లో దాచుకుంటామని ఆయన చెప్పారు.

మహానాడులో తెలుగు యువత రక్తదానం

గుంటూరు సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న మహానాడులో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన తెలుగు యువత పెద్ద ఎత్తున రక్తదానం చేసినట్లు రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు దియ్యా రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో విరివిగా పాల్గొని రక్తదానం చేయాలని ఇచ్చిన పిలుపునకు స్పందించిన తెలుగు యువత భారీ సంఖ్య లో భాగస్వాములైనట్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇటువంటి సేవా కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొంటామని యువత ప్రతిజ్ఞ చేసినట్లు వివరించారు. మెగా రక్తదాన శిబిరంలో తాను 50వ సారి రక్త దానం చేసినట్లు వెల్లడించారు.

ఉద్యోగుల సమస్యల ఎజెండాగా రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

గుంటూరు(తూర్పు), మే 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జూన్ 5న విజయవాడలో జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను చర్చించనున్నట్టు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ అన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్ని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాలకు ప్రతి ఒక్క ఉద్యోగి హాజరవ్వాలని కోరారు. సీపీఎస్ రద్దు, 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, గత ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు, మధ్యంతర భృతి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ వంటి సమస్యలపై చర్చించనున్నట్టు అన్నారు. సమావేశానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రమేష్‌కుమార్, జి నాగసాయి, కేదార్, రామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా, సుమిత్రాదేవి, అరుణకుమారి, షబానా సుల్తానా, లీలాబాయి తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు, కలెక్టరేట్‌లో జరిగిన ప్రచారంలో పాల్గొన్న కేఆర్ సూర్యనారాయణ తదితరులు

కొటారియా ఇన్‌ఫ్రాకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయి

● హైకోర్టు న్యాయవాది తిరుపాల్ ఫిర్యాదు అవాస్తవం

● ఆ సంస్థ మేనేజింగ్ పార్టనర్ నెల్లూరి వంశీకృష్ణ

గుంటూరు కార్పొరేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి): నల్లపాడులో సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన వెంచర్ కొటారియా ఇన్‌ఫ్రాకు సంబంధించి జీఎంసీ, సీఆర్ డీఏ నుంచి అన్ని రకాల అనుమతులు ఉన్నాయని ఆ సంస్థ మేనేజింగ్ పార్టనర్ నెల్లూరి వంశీకృష్ణ మంగళవారం తెలిపారు. తమ వద్ద విల్లా కొన్నట్లుగా, తమకు అడ్వాన్సు కింద డబ్బులు చెల్లించినట్లుగా హైకోర్టు న్యాయవాది బీపీ తిరుపాల్ చేసిన ఆరోపణలు, కమిషనర్ పులి శ్రీనివాసులకు అందించిన ఫిర్యాదు అవాస్తవమన్నారు. మా లేఅవుట్, వెంచర్‌కి సంబంధించి అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, గత కొన్ని నెలలుగా మాపై వేధింపులకు పాల్పడుతున్నారని, కుల దూషణ కింద కూడా అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని ఆయన తెలిపారు. తిరుపాల్ చేసిన ఫిర్యాదులో వాస్తవాలు లేవని ఆయన అన్నారు.

అపార్ట్‌మెంట్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

గుంటూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వసంతరాయపురంనకు చెందిన బండి శ్రావణ్‌కుమార్ (52) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వసంతారాయపురంనకు చెందిన బండి శ్రవణ్ కుమార్ పది సంవత్సరాల క్రితం భార్య నుంచి విడిపోయి ఒంటరిగా వసంతరాయపురంలోని కాకర్ల హైట్స్ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నాడు. గతంలో రెండు సార్లు బ్రెయిన్ స్ట్రోక్‌కి గురి అయ్యాడు. ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నాడు. మూడు రోజుల నుంచి ఇంటిలో నుంచి బయటికి రాలేదు. మూడు రోజుల నుంచి ఫ్లాట్ తలుపులు మూసే ఉన్నాయి. ఫ్లాట్ నుంచి దుర్వాసన వస్తుండటంతో, చుట్టుపక్కల వారు పోలీసు వారి సహాయంతో తలుపు పగలగొట్టి చూడగా శ్రావణ్‌కుమార్ బెడ్ రూమ్ లోని మంచంపై చనిపోయి పడి ఉన్నాడు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉంది. మృతుని అన్న బండి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల స్థలాలకై 2న తాలూకా కార్యాలయం వద్ద ధర్నా

గుంటూరు(తూర్పు), మే 27(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి, నివాసాలు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలనే ప్రభుత్వ హామీని నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 2న స్థానిక తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్నాకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట తప్పారని విమర్శించారు. అద్దె ఇంట్లో ఉండలేక సొంత ఇల్లు లేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వక్ఫ్ భూముల పరిరక్షణలో అన్ని విధాలుగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తాలుకా కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు, అరుణ్ కుమార్, షేక్ వలి, జంగాల చైతన్య పాల్గొన్నారు.

స్థూల జాతీయోత్పత్తిలో నాల్గవ స్థానంలో భారత్

● ఇతర రంగాలలో అట్టడుగున

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు కార్పొరేషన్, మే 27(ఆంధ్రజ్యోతి) : నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఇటీవల భారతదేశ స్థూల జాతీయోత్పత్తి 4.18 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో 4వ స్థానానికి చేరిందని, త్వరలో జర్మనీని అధిగమించి 3వ స్థానానికి భారత స్థూల జాతీయోత్పత్తి చేరుకుంటుందని గొప్పగా ప్రకటించారని, అయితే లోతుగా వెళ్లి భారతదేశ పరిస్థితిని అధ్యయనం చేస్తే మనం ప్రపంచంలో బాగా వెనుకబడిన దేశాలతో పోటీ పడుతున్నామని అర్థమౌతుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. గుంటూరులోని జన చైతన్య వేదిక హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 1990లో భారతదేశం, చైనా రెండింటి ఆర్థిక వ్యవస్థ దాదాపు ఒకటిగా ఉంటే నేడు చైనా మనకన్నా తలసరి ఆదాయంలో, స్థూల జాతీయోత్పత్తిలో దాదాపు 5 రెట్లు ఎక్కువగా ఉందన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ, అధికార అవినీతిలను రూపు మాపి, కార్పొరేట్ శక్తులను బలోపేతం చేయడం మాని, ఆర్థిక అసమానతలు, పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగిత లాంటి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో ప్రముఖ ఆర్థిక వేత్త ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం, సామాజిక విశ్లేషకులు అడపా వేణుగోపాల్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేస్ లక్ష్మణరావు, పక్కన లక్ష్మణ రెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు

శృంగార నైషధంపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో శృంగార నైషధంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆధ్యాత్మిక ప్రవచకురాలు డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి ప్రవచిస్తూ శ్రీనాథుని శృంగార నైషధం తెలుగు పంచకావ్యాలలో మొదటిదన్నారు. ఇది నల, దమయంతిల ప్రేమకథను వర్ణిస్తుందన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో వినయశ్రీ, జ్ఞానదివ్య సత్తా

మంగళగిరి సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరిగిన జాతీయ సబ్‌జూనియర్, జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మహిళా లిఫ్టర్లు ఈఎల్ వినయశ్రీ, నాగం జ్ఞానదివ్యలు సత్తా చాటారు. సబ్ జూనియర్స్ 84 కిలోల విభాగంలో వినయశ్రీ స్కాట్‌లో 122.5 కిలో లతో కాంస్యం, బెంచి ప్రెస్‌లో 50 కిలోలతో రజతం, డెడ్‌లిఫ్ట్‌లో 130 కిలోలతో కాంస్యం, ఓవరాల్‌గా 302.5 కిలోల బరువును ఎత్తి రజత పతకం సాధించింది. జూనియర్స్ 84 కిలోలు పైబడిన విభాగంలో జ్ఞానదివ్య స్కాట్‌లో 177.5 కిలో లతో స్వర్ణం, బెంచి ప్రెస్‌లో 62.5 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 155 కిలోలతో కాంస్యం, ఓవరాల్‌గా 395 కిలోల బరువును ఎత్తి రజత పతకం సొంతం చేసుకుంది. పతకాలు సాధించిన మహిళా లిఫ్టర్లను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, సకల సూర్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయబాస్కరరావు, షేక్ సంధాని అభినందించారు.



పతకాలు సాధించిన వినయశ్రీ, జ్ఞానదివ్య

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11213 | 99854 11225 | 99854 01877 | 99854 04047 | 99854 01614

రేపు జూనియర్స్ విభాగంలో బాక్సింగ్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), మే 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు డిస్ట్రిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ స్టేడియంలో ఈనెల 29న అండర్-17, బాలురు, బాలికల విభాగాల్లో జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే.వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు 44-80 మధ్య కేజీల వరకు బరువున్న వారు, 2009-2010 ఏడాదిల్లో పుట్టిన వారు అర్హులన్నారు. ఈ పోటీలలో ఎంపికైన వారు జూన్ 2 తేదీ నుంచి వైజాగ్‌లో జరిగే అంతర్ జిల్లా పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 94404 31910, 94947 67786 అనే నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

ఈవీఎంల భద్రతలో రాజీపడొద్దు

● ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీలలో భాగంగా మంగళవారం ఉదయం గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ తేజ తనిఖీ చేశారు. సీసీ టీవీ వ్యవస్థ పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రత సిబ్బంది లాగ్ బుక్‌ను తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో కె.శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక అదనపు అధికారి కె.కృష్ణా రెడ్డి, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.నాగేశ్వరరావు, ఎలక్ట్రికల్ డివిజన్ డీఈ ఏ.కాళీ మాత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోని ఇవిఎం గోడౌన్‌ని తనిఖీ చేస్తున్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ తేజ

ఆర్‌వీఆర్ అండ్ జేసీలో ఎన్‌సీసీ శిక్షణ తరగతులు

గుంటూరు (విద్య), మే 27 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ రక్షణ వ్యవస్థ లో విద్యార్థులు భాగస్వాములు అయ్యేందుకు సిద్ధంగా ఉండాలని, ఎన్‌సీసీ ద్వారా తీసుకునే శిక్షణ తరగతులు సైనిక శిక్షణలో ప్రాథమిక దశను పూర్తి చేసుకోవడంతో పాటు, నాయకత్వ లక్షణాలను పొందుపర చుకోవచ్చని క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్వీఎస్ సుదర్శన్ అన్నారు. ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 10 ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు, పల్నాడు, ప్రకాశం నెల్లూరు జిల్లాలలోని వివిధ పాఠశాలలు, కళాశాల నుంచి ఎన్‌సీసీ బాలురు, బాలికల క్యాడెట్లు 710 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు జూన్ 4 వరకు జరుగుతాయని, ఇందులో పాల్గొన్న విద్యార్థులకు ఎన్‌సీసీ అధికారులు, నిపుణులతో యోగ, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, ట్రెక్కింగ్, ఫిజికల్ ట్రైనింగ్, లీడర్‌షిప్ క్వాలిటీస్, సోషల్ సర్వీస్ ఆక్టివిటీస్, సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఫైర్ అండ్ సేఫ్టీ డ్రిల్, ఎన్‌డీఆర్ఎఫ్ ట్రైనింగ్ తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణను అందించనున్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ అవినాశి పట్వాల్, క్యాంపు సీనియర్ జేసీవో ఇమాం సాహెబ్ షేక్, క్యాంపు ట్రైనింగ్ అన్ జేసీవో రాజు, క్యాంపు సూపరింటెండెంట్ కొల్లా రాజశేఖరబాబు, కళాశాల ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ తారాచంద్, డాక్టర్ ఉషాక్రాంతి పాల్గొన్నారు.



శిక్షణ తరగతులకు హాజరైన ఎన్‌సీసీ విద్యార్థులు

వాళ్ళు కరుడు గట్టిన రౌడీషీటర్స్

● కానిస్టేబుల్‌నే చంపబోయారు ● ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : వాళ్ళు కరుడు గట్టిన రౌడీషీటర్స్ అని.. ఏకంగా కానిస్టేబుల్‌నే చంపబోయారు.. పోలీస్ వ్యవస్థకే సవాల్ విసిరారని ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. గత నెలలో తెనాలిలోని ఐతానగర్ సెంటర్‌లో నడిరోడ్డుపై ఆయా రౌడీషీటర్స్‌కు పోలీస్ మార్క్ లాఠీ కోటింగ్ ఇచ్చిన వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం విధితమే. దీనిపై ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలని ఆయన సూచించారు. తెనాలి ఐతానగర్‌లోని జయప్రకాష్ నగర్‌లో నివాసం ఉండే కన్నా చిరంజీవి పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడన్నారు. ఆయన విధి నిర్వహణలో భాగంగా పలు కేసుల్లో నిందితులైన రౌడీషీటర్స్ చేబ్రోలు జాన్ విక్టర్, దోమ రాకేష్‌లను కౌన్సెలింగ్ కోసం తెనాలి 3 టౌన్ స్టేషన్‌కు గంజాయి తాగే అలవాటు ఉన్న ఇతర వ్యక్తులతో పిలిపించారన్నారు. అప్పటి నుండి ఆయా రౌడీషీటర్స్ కానిస్టేబుల్ చిరంజీవిపై వ్యక్తిగత కక్ష పెంచుకున్నారన్నారు. ఫలితంగా వారు కానిస్టేబుల్‌ను నరికి చంపాలని అనుకున్నారన్నారు.

గత నెల 24న రాత్రి ఐతానగర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఎదురుగా ఉన్న పల్లెకొండవారి వీధిలో కానిస్టేబుల్ చిరంజీవి రాక కోసం వేచి ఉన్నారన్నారు. రాత్రి 9.30 గంటల సమయంలో చిరంజీవి తెనాలి 1 టౌన్ పిఎస్ వైపు వెళుతుండగా ఆయా నిందితులందరూ అతడిని అడ్డుకుని అతని మోటార్ సైకిల్‌ను ఆపి, అతనితో గొడవకు దిగి, చేతులతో కొట్టి గాయపరిచారన్నారు. చిరంజీవి నిందితుల బారి నుండి తప్పించుకునేందుకు పారిపోయాడన్నారు. అయితే ఈ కేసులోని నిందితులంద రూ కరుడుగట్టిన రౌడీషీటర్‌లని, హత్యలు, హత్యాయత్నా లు, కొట్లాటలు, గంజాయి, దొంగతనాలు, మహిళలపై దాడులు వంటి అనేక నేరాలకు పాల్ప డ్డారన్నారు. కరిముల్లా మినహా మిగిలిన వారిపై ఒక్కొక్కరిపై పదికి పైగా కేసులు ఉన్నాయన్నారు. కాగా కానిస్టేబుల్ చిరంజీవి ఫిర్యాదు మేరకు తెనాలి- 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఆయా నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. వారిని అరెస్ట్ చేసే క్రమంలో నిందితులపై పోలీసులు కొంత అనుచితంగా వ్యవహరించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

తండ్రి మందలించాడని బాలిక ఆత్మహత్య

గుంటూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురైన బాలిక ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ నుంచి దస్తగిరి సైఫుద్దీన్, సలీమా దంపతులు సుమారు 17 సంవత్సరాల క్రితం బతుకుతెరువు కోసం గుంటూరు నగరానికి వచ్చారు. పట్టాభిపురం మూడో లైన్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని బోటిక్, మ్యాచింగ్ సెంటర్ నిర్వహిస్తూ పై అంతస్తులో నివాసం ఉంటున్నారు. వారికి ఇరువురు కుమార్తెలు సంతానం ఉన్నారు. పెద్ద కుమార్తె దస్తగిరి సుమన్ అలియాస్ ముస్కాన్ (15) పదో తరగతి చదివింది. ఇటీవల వచ్చిన ఫలితాల్లో ఆమెకు 560 మార్కులు వచ్చాయి. అయితే మార్కులు తగ్గాయని సోమవారం ఉదయం తండ్రి బయటకు వెళ్తూ కుమార్తె సుమన్‌ను మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన సుమన్ ఇంట్లోనే పై అంతస్తులో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రి సుమారు 10 గంటల సమయంలో తల్లి సలీమా పై అంతస్తుకు వెళ్ళి చూడగా కూతురు ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వారి ఫిర్యాదు మేరకు మంగళవారం పట్టాభిపురం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







మహానాడు సంబరం

కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.





కడప మహానాడులో సభ్యత్వం తీసుకుంటున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడికిలి బిగించి అభివాదం చేస్తున్న కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్



మహానాడు వేదికపై గుంటూరు పశ్చిమ, తాడికొండ ఎమ్మెల్యేలు గల్లా మాధవి, తెనాలి శ్రావణ్‌కుమార్, కనపర్తి శ్రీనివాసరావు

మహానాడులో మన నేతల సందడి



మహానాడు ప్రాంగణంలో గుంటూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ షేక్ సజీల



సభలో ప్రసంగిస్తున్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



మహానాడు ప్రాంగణంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, గుంటూరు కార్పొరేషన్ మేయర్ కోవెలమూడి రవీంద్ర



లోకేశ్‌తో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



మంత్రులు లోకేశ్, కొల్లు రవీంద్రతో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ



టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబుతో మంత్రి అనగాని సత్యప్రసాద్



వైద్య శిబిరంలో సిబ్బందికి సూచనలిస్తున్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



నియోజకవర్గ శ్రేణులతో కలిసి మహానాడుకు వస్తున్న చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



మహానాడు ప్రాంగణంలో గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాస్టారు



గుంటూరు పార్లమెంట్ కేంద్రంలో సభ్యత్వ నమోదు తీసుకున్న పార్టీ శ్రేణులు



సభ్యత్వ నమోదు కోసం పల్నాడు పార్లమెంట్ కేంద్రం వద్ద బారులు తీరిన శ్రేణులు



సభ్యత్వ నమోదు కోసం బాపట్ల కేంద్రం వద్ద శ్రేణుల బారులు

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 587 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.11,400 మోడల్‌ధర రూ.10,600 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.11,400 మోడల్‌ధర రూ.10,850 పలికాయి.

రేపు ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

పెదనందిపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో గురువారం సాయంత్రం 4గంటలకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నల్లబర్లీ పొగాకు కొనుగోలు, గుంటూరు ఛానెల్ పొడిగింపు, నల్లమడ వాగు ఆధునికీకరణకు ప్రభుత్వం నిధుల కేటాయింపుపై చర్చిస్తామని, ఈ కార్యక్రమంలో ఆయా ప్రజాసంఘాల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రత్యేక అవసరాల బాలల గుర్తింపు

మంగళగిరి, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల బాలబాలికల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో సర్వే నిర్వహిస్తున్నట్టు ప్రత్యేక అవసరాలు గల ఉపాధ్యాయులు టీ జయలక్ష్మీ, డీ లక్ష్మీ తెలిపారు. ఈ సర్వే రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 13 నుంచి జూన్ 9వ తేదీ వరకు జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వార్డు సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్పించడమే ఈ సర్వే ఉద్దేశమని ఎంఈవోలు శ్రీనివాసరావు, బాబు తెలియజేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

మంగళగిరి సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి రూ.పది వేల జరిమానా విధించినట్టు మంగళగిరి రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. ఆత్మకూరు జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా, ఆత్మకూరు గ్రామానికి చెందిన కొండపల్లి సాయిమణికంఠ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని చెప్పారు. సదరు వ్యక్తిని కోర్టులో హాజరు పర్చగా న్యాయ మూర్తి రూ.పది వేల జరిమానా విధించారని తెలియజేశారు.

బాలిక అదృశ్యంపై కేసు

దుగ్గిరాల, మే 27(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై దుగ్గిరాల పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. చింతలపూడికి చెందిన 17ఏళ్ల బాలిక సోమవారం నుంచి కనిపించడం లేదని తండ్రి జగన్నాథం కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరవి తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

తాడికొండ(కంతేరు), మే 27 (ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంతేరు గ్రామానికి చెందిన రామకృష్ణకు, గుంటూరుకు చెందిన లక్ష్మీ తిరుపతమ్మకు 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహం జరిగిన దగ్గర నుంచి లక్ష్మీ తిరుపతమ్మ భర్త రామకృష్ణ అదనపు కట్నం కోసం రోజు శారీరకంగా, మాసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. భర్తతో పాటు అతని తల్లి పార్వతి కూడా అదనపు కట్నం కోసం వేధిస్తూ తన కుమారుడికి మరొక వివాహం చేస్తానని బెదిరించిందన్నారు. అంతేకుండా రామకృష్ణకు వివాహేతర సంబంధం కూడా ఉండటంతో నిత్యం వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన మహిళ ఈనెల 21వ తేదీన కంతేరులోని తన ఇంట్లో ఆహారంలో పురుగు మందు కలిపి తిని ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు గ్రామంలో ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించిన తరువాత గుంటూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులకు సమాచారం ఇవ్వవద్దని చెప్పి రామకృష్ణ పరారయ్యాడు. అక్కడ ఆమె పరిస్థితి విష మించటంతో 25వ తేదీన గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. దీంతో తాడికొండ పోలీస్ స్టేషన్‌లో మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జోజి తెలిపారు.

కమ్యూనిటీ హాల్‌కి స్థలం కేటాయించాలి

తాడేపల్లి టౌన్ మే 27(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు టీ దుర్గారావు ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణుల కమ్యూనిటీ హాలుకు స్థలం ఏర్పాటు చేయాలని సోమవారం తాడేపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌ను సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. 900 కుటుంబాలు మండలంలో ఉన్నాయని, వృత్తి శిక్షణకు, నిద్రలు చేయటానికి, ఎక్కడా కమ్యూనిటీ హాలు లేనందున నాయీబ్రాహ్మణులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నారా లోకేశ్, దృష్టికి తీసుకెళ్ళి మండలంలో ఎక్కడైనా మాకు కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయించవల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు పతకమూరి రామకోటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి విజయ్, లక్ష్మణ్ కావూరి నరసింహారావు, కోశాధికారి, పాతూరి నాగబాబు, రవి, నాని, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

పెదనందిపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గోగులమూడి పోలేరమ్మ తిరునాళ్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి తలంట్లు పోసి, పొంగళ్లు పొంగించి, చద్దులతో మొక్కులు చెల్లించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

చేసిన పనులే మళ్లీ మళ్లీ..

- పూడిక తీసిన కాలువలోనే ఉపాధి పనులు
- మండల అధికారుల నిర్వాకం
- రెండు వారాలు సాగిన తీరు



మళ్లీ పూడిక తీసిన ఎన్‌ఎస్‌పీ కెనాల్

ప్రత్తిపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలో అధికారుల లీలలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఓ ప్రక్క ప్రభుత్వం లక్షలాది రూపాయల వ్యయంతో కాలువల మరమ్మతులు చేపించి చివరి వరకు నీరు పంట పొలాలకు అందేలా చర్యలు తీసుకుంటే.. అదే కాలువలో ఉపాధిహామీ పథకం పనులు చేయించి చూసే వారు ముక్కున వేలేసుకునేలా చేశారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని నడింపాలెం గ్రామం మీదగా ఎన్‌ఎస్‌పీ కెనాల్ సాగుతుంది. అయితే గతంలో ఈ కాలువ మొత్తం పూడి పోయి చివరి వరకు నీరు అందని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం రావడం, ఆ తరువాత నీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. వెను వెంటనే ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చొరవతో అటు వంకాయలపాటి మేజర్, ఇటు పాతమల్లాయపాలెం మేజర్ కాలువలను లక్షలాది రూపాయల వ్యయంతో పూడిక తీశారు. అయితే ఇది జరిగి నెలలు కూడా గడవక ముందే ఉపాధిహామీ పథకం ద్వారా ఇదే కాలువలో చినకోండ్రుపాడు వద్ద కాలువ పూడిక తీత పనులు చేపట్టారు. అందులో వారు ఏమి తీశారో ఏమో కాని సుమారు రెండు వారాల పాటు పనులు ఏకదాటిగా జరిగినట్టు అధికారులు తెలియజేస్తున్నారు. సుమారు ఐదు వందల మందల మంది వరకు ఈ కాలువలో పనులు చేసినట్టు తెలుస్తుంది. తీసిన కాలువలో పనులు ఏ విధంగా చేయిస్తారు అనే దానికి ఉపాధిహామీ పథకం సిబ్బంది నుంచి సమాధానం లేదు. అయితే తీసిన కాలువను తీయించడంలో మండలాధికారి ప్రమేయం ఉన్నట్లు తెలుస్తుంది. అందుకే ఎవరూ కూడా నోరు మెదపటం లేదు.

పనుల్లో అవినీతి ఆరోపణలు

అయితే ఈ కాలువలో పూడిక తీత విషయంలో గ్రామంలో అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. మే నెల మొదటి వారంలో ఇక్కడ పనులు జరిగాయి. అప్పుడు బయటకు రాని విషయాలు ఇప్పుడు ఉపాధిహామీ పథకం సిబ్బంది అవినీతి ఆరోపణలతో బయటకు వస్తున్నాయి. ఇక్కడ జరిగిన పనుల్లో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఉపాధిహామీ పథకంలో దొంగ మస్టర్లు వేసి మండల స్థాయి అధికారుల జేబుల్లోకి వెలుతున్నాయన్నది బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో కాలువ పూడికతీత పనుల్లో మండల స్థాయి అధికారుల చేతి వాటం ఉన్నట్టు తెలుస్తుంది. అయితే ఈ ఒక్క గ్రామంలోనే కాకుండా ఈదులపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో కూడా ఇదే రీతిలో పనులు జరిగినట్టు తెలుస్తుంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులే నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

నాకు ఏమీ తెలియదు : ఏపీవో ఏడుకొండలు



అయితే ఈ విషయంపై ప్రత్తిపాడు ఉపాధిహామీ పథకం ఏపీవో ఏడుకొండలును వివరణ కోరగా సమాధానం చెప్పడానికి ఆయన తటపటాయించారు. నాకేమీ తెలియదంటూ చెప్పడం వారి పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుంది.

టీడీపీతోనే సంక్షేమ పథకాల అమలు

- ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



మహానాడు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, మే 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ తోనే సంక్షేమ పథకాలు అమలు సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ మహానాడు సభలు మంగళవారం కడపలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహానాడు సభలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. పేద వారికి పట్టెడన్నం పెట్టలేని రాజకీయాలు ఎందుకు.. పార్టీలు ఎందుకు అని ప్రశ్నించిన నందమూరి తారక రామారావు 42 ఏళ్ల క్రితం సమాజమే దేవాలయం.. ప్రజ లే దేవుళ్లు అంటు స్థాపించిన పార్టీనే తెలుగుదేశం అని అన్నారు. పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని పేదరికం నుంచి బయటకు తీసుకు వచ్చేందుకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పేదలకు సంక్షేమ పథకాలు, ఉండటానికి ఇళ్లు, తినటానికి తిండి వంటి పథకాలు వచ్చాయన్నారు. తరువాత పార్టీ పగ్గాలు అందుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదరికం లేని సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు సాగుతున్నారని తెలిపారు. అనేక రకాల పథకాలను రూపొందించారన్నారు. గతంలో మహిళల కోసం సెర్ప్ అనే సంస్థను స్థాపించారన్నారు. ఈ సంస్థతో మహిళలను చైతన్యపరుస్తూ వారు సమాజంలో స్థిరపడేలాగా కృషి చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే పీ-4 పథకాన్ని ప్రవేశపెట్టారని, ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, ప్రజలు, భాగస్వామ్యం అయ్యేలా చూశారన్నారు. 2047 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా ఏపీను నిలపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు.

గొప్ప సంఘసంస్కర్త కందుకూరి

- ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా

పెదనందిపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట సంస్కరణలకు ఆద్యులు, తొలి వితంతు వివాహాన్ని జరిపించిన గొప్ప సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ ఆనాటి సమాజంలో మూఢనమ్మకాలపై పోరాటం చేసిన గొప్ప సంఘసంస్కర్త అని, తొలి నవలా రచయిత, తెలుగుజాతి నవయుగ వైతాళికుడు కందుకూరి అని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, వెలినేని శివయ్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత, మెరుగైన ఆరోగ్యం



యోగా శిక్షణలో పాల్గొన్న వట్టిచెరుకూరు ఎంపీడీవో, అధికారులు

దుగ్గిరాల, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ యోగాతో మెరుగైన ఆరోగ్యంతో జీవించవచ్చునని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. మండలంలోని చిలువూరుగ్రామంలోని షాదీఖానా ఆవరణలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ షేక్ జబీన్ మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగా శిక్షణ శిబిరాన్ని ఉద్దేశించి జబీన్ మాట్లాడుతూ యోగాతో మెరుగైన ఆరోగ్యం ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంచుకోవచ్చునని అన్నారు. సర్పంచ్ చిలువూరు మాణిక్యం, సీహెచ్ సుజాత, పోపూరి సుజాత, గృహనిర్మాణశాఖ ఏఈ సుబ్బారావు, కార్యదర్శి ఎం శరత్, గ్రామసచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● మేడికొండూరు (ఆంధ్రజ్యోతి): యోగా మనిషి జీవితానికి ఎంతో అవసరమని, యోగా ద్వారా మానసిక ధైర్యాన్ని పెంచుకోవడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు సహాయపడుతుందని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని మండల యోగా ఆంధ్ర చైర్మన్, ఎంపీడీవో తోట చందన చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా మే 27వ తేదీనుంచి 31తేదీ వరకు మేడికొండూరు మండలం గుండ్లపాలెంలోని ఎస్ఆర్ఐ కళాశాలలో యోగాపై మండల స్థాయి శిక్షకులకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇచ్చే కార్యక్రమం మంగళవారం ఎంపీడీవో చందన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఈఓపీఆర్‌డీ పూర్ల శంకరరావు పాల్గొన్నారు. ఈ శిక్షణలో మండల వ్యాప్తంగా 150 మంది సభ్యులు యోగా శిక్షణలో పాల్గొన్నారు.

● పెదనందిపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యవంతమైన జీవనం కొనసాగించవచ్చునని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. స్థానిక సోమేశ్వరస్వామి కాలక్షేప మండపంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయుష్మాన్‌భారత్, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు యోగాభ్యాసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా శిక్షణ తీసుకున్న వారు ఈనెల 3 నుంచి ఆయా గ్రామాల్లో ప్రజలకు యోగా శిక్షణనివ్వాలన్నారు. గ్రామ, వార్డుస్థాయిలో యోగాపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరినీ భాగస్వాములుగా చేసి ప్రభుత్వ వెబ్‌సైట్లో నమోదు చేయాలని తెలిపారు.

● కాకుమాను, మే 27(ఆంధ్రజ్యోతి): యోగా ప్రతి ఒక్కరి జీవితాల్లోఒక భాగం కావాలని ఎంపీడీవో యుగకీర్తి అన్నారు. స్థానిక విద్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగా వలన మానసిక ప్రశాంతత ఏర్పడుతునందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● వట్టిచెరుకూరు (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రా కార్యక్రమంలో వట్టి చెరుకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆడిటోరియంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయాల సిబ్బందికి యోగా శిక్షణ తరగతులను మంగళవారం ఎంపీడీవో రమేష్‌బాబు లాంఛనంగా ప్రారంభించి యోగా శిక్షణలో పాల్గొన్నారు.

మత సామరస్యం, సమగ్రతను కాపాడుకుందాం



ర్యాలీలో పాల్గొన్న వామపక్షాలు, వివిధ సంఘాల ప్రతినిధులు

మంగళగిరి సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యం, దేశ సమగ్రతను కాపాడుకునేందుకు ప్రజలందరూ సంఘటితంగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు పిలుపునిచ్చారు. పెహల్గాం ఉగ్రదాడికి నిరసనగా, మత సామరస్యం, దేశ సమగ్ర పరిరక్షణకై సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పరిరక్షణ కమిటీ, పాస్టర్స్ అసోసియేషన్, కాంగ్రెస్, ముస్లిం ధార్మిక సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పట్టణంలో సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సెంటరులో వీసం వెంకట జవహర్‌లాల్, అన్నవరపు ప్రభాకర్, కూరపాటి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు నేతలు ప్రసంగించారు. యుద్ధం చేస్తున్నామని చెప్పి పాకిస్తాన్ ఆక్రమిత ఉగ్రవాద సంస్థలపై దాడులు చేశారని తెలిపారు. కాల్పుల విరమణ జరిగిన విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడాన్ని తప్పుబట్టారు. భారత రాజ్యాంగంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం దాడి చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నేత జంగాల అజయ్‌కుమార్, వివిధ సంఘాల నేతలు ఎండీ యూసుఫ్, కే.జీవన్‌సాగర్, కే.రామారావు, బి.రవికిషోర్, చిన్ని తిరుపతయ్య, పీ.తిమోతి, పీ.బాలకృష్ణ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయ భూములపై విచారిస్తున్నాం

- డిప్యూటీ కలెక్టర్ భాగ్యరేఖ

తుళ్లూరు, (రాయపూడి) మే 27 (ఆంధ్రజ్యోతి) రాయపూడి వేణుగోపాల స్వామి ఆలయ భూముల విషయాన్ని విచారిస్తున్నట్టు సీఆర్డీఏ రాయపూడి యూనిట్ డిప్యూటీ కలెక్టర్ ఆంధ్రజ్యోతికి సోమవారం తెలిపారు. రాయపూడి సర్వే నెం172, లో 2.73 సెంట్లు,, డినెం 174బిలో 2.50 సెంట్లు డినెం 132 లో 1. 50 సెంట్లు మొత్తం 6.77 ఎకరాలు మల్లెల వెంకట్రాయుడు వేణుగోపాలస్వామి ఆలయానికి 1932లో దానం చేసినట్లు, దానిని రాజధాని కోసం ల్యాండు పూలింగ్ స్కీంలో ఇచ్చి వేరే వారు ప్లాట్లు పొందినట్లు ఆరోపణలొచ్చాయని, దీనిపై ఎండోమెంట్ వారు ఎటువంటి పత్రాలు సీఆర్డీఏకి ఇవ్వలేదని తెలిపారు. భూమి మీద వచ్చే ఫలసాయాన్ని ఆలయానికి ఇచ్చారా.. లేదా భూమిని స్వామి వారికి రాసేశారా.. అనేది విచారిస్తున్నామని తెలిపారు. అయితే వేణుగోపాల స్వామి, ఆలయానికి శివాలయానికి దీప, ధూప నైవేద్యాలకు అఖండ జ్యోతి నిత్యం వెలిగేందుకు నూనెకు అయ్యే ఖర్చు ఆలయం కింద ఉన్న సత్రం మరమ్మతులకు ఫలసాయం ఖర్చు చేసే విధంగా వారసులు చర్యలు తీసుకోవాలని రిజిష్టర్ వీలునామా ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం.

బాల్య వివాహాలను అడ్డుకోవడం అందరి బాధ్యత : ఎంపీడీవో

మేడికొండూరు, మే 27(ఆంధ్రజ్యోతి): సమాజంలో జరిగే బాల్య వివాహాలను అడ్డుకోవడం అందరి బాధ్యత అని మండలపరిషత్ అధికారి తోట చందన చెప్పారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ వంటి చట్టాలపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ కె.సమీర్‌కుమార్, సెక్టర్ సూపర్‌వైజర్ కె.కృష్ణకుమారి ప్రసంగించారు. సమావేశంలో సూపర్‌వైజర్ క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ జి.వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్‌ను పరిశీలించిన ఆర్డీవో



రేపూడి గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు

ఫిరంగిపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రోసూరు వ్యవసాయ మార్కెట్ నందు భద్ర పరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల గోడౌన్‌ను మంగళవారం గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కే శ్రీనివాసరావు తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నెలవారి తనిఖీల్లో భాగంగా గోడౌన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఫిరంగిపురం తహసీల్దార్ ప్రసాద రావు, ఆర్‌అండ్‌బీ ఏఈ అరుణకుమారి, అగ్నిమాపక శాఖ అధికారి అనీల్‌సింగ్, విద్యుత్‌శాఖ ఎల్ఐ వీ శివకుమార్, ఏఎస్‌వో ఎన్ శివ తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహానాడుకు తరలివెళ్లిన తెలుగుతమ్ముళ్లు

పెదనందిపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు కార్యక్రమానికి మండలం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో నాయకులు కార్యకర్తలను కలుపుకొని కార్లు, జీపుల్లో మహానాడుకు తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా కడపలో ఏర్పాటు చేసిన మహానాడుకు తెలుగుతమ్ముళ్లు తరలివెళ్లారు.

● ఫిరంగిపురం, మే 27 (ఆంధ్రజ్యోతి) ఫిరంగిపురం నుంచి కడపలో జరిగే మహానాడుకు టీడీపీ నాయకులు మంగళవారం పలు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల అప్పారావు, బందనాధం సతీష్, మాజీ ఎంపీపీ లూర్దయ్య, కోటా శేషు తదితరులు పాల్గొన్నారు.



మహానాడుకు బయలు దేరిన ఫిరంగిపురం టీడీపీ నేతలు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 98484 11050 99854 03281

పవర్ లిఫ్టింగ్‌లో వినయశ్రీ, జ్ఞానదివ్య సత్తా



పతకాలు సాధించిన వినయశ్రీ, జ్ఞానదివ్య

మంగళగిరి సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరిగిన జాతీయ సబ్‌జూనియర్, జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మహిళా లిఫ్టర్లు ఈఎల్ వినయశ్రీ, నాగం జ్ఞానదివ్యలు సత్తా చాటారు. సబ్ జూనియర్స్ 84 కిలోల విభాగంలో వినయశ్రీ స్క్వాట్‌లో 122.5 కిలో లతో కాంస్యం, బెంచి ప్రెస్‌లో 50 కిలోలతో రజతం, డెడ్‌లిఫ్ట్‌లో 130 కిలోలతో కాంస్యం, ఓవరాల్‌గా 302.5 కిలోల బరువును ఎత్తి రజత పతకం సాధించింది. జూనియర్స్ 84 కిలోలు పైబడిన విభాగంలో జ్ఞానదివ్య స్క్వాట్‌లో 177.5 కిలో లతో స్వర్ణం, బెంచి ప్రెస్‌లో 62.5 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 155 కిలోలతో కాంస్యం, ఓవరాల్‌గా 395 కిలోల బరువును ఎత్తి రజత పతకం సొంతం చేసుకుంది. పతకాలు సాధించిన మహిళా లిఫ్టర్లను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, సకల సూర్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని అభినందించారు.

నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అందిపుచ్చుకోవాలి



స్వయం సహాయక బృందాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న సెర్ప్ అధికారి

తుళ్లూరు, మే 27(ఆంధ్రజ్యోతి): సీఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అందిపుచ్చుకోవాలని అధికారులు కోరారు. మంగళవారం రెండో రోజు శిక్షణ తరగతులు డ్వాక్రా సంఘాల మహిళలకు మండలపరిషత్ కార్యాలయం, తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో కొనసాగాయి. మహిళల ఆర్థిక ఎదుగుదల కోసం నైపుణ్యాభివృద్ధి సంస్థ పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నటు తెలిపారు. అమరావతి అభివృద్ధిలో మహిళలకు ఉన్న జీవనోపాధి అవకాశాలను తెలియజేశారు. రాజధాని అమరావతిలో మహిళలకు సాధికారత కల్పించటం, యువతకు ఉపాధి నైపుణ్యాలను అందిచడం కోసం సీఆర్డీఏ స్కిల్ హబ్‌ను ప్రారంభించిందన్నారు. ఇప్పటికే పలు బ్యాచ్‌లకు పెయింటింగ్, టైలరింగ్, డేటా ఎంట్రీ, తదితర కోర్సుల్లో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్డీఏ సోషల్‌వెల్ఫేర్ అధికారి బీ శ్రీనివాసరావు, సెర్ప్ అధికారులు వీరశేఖర్, ఏపీ ఎం వీరయ్య, డీపీఎం రాంబాబు, ఎస్ఆర్ఎల్ఎం శశికళ, డ్వాక్రా సంఘాల సభ్యులు, సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

తాడేపల్లి టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళా శాసనములతో పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో మంగళవారం సర్వరక్షకార సుదర్శన హోమం వైభవంగా జరిగింది. అమావస్య సందర్భంగా హోమం, పారాయణం, శాంతులు, దానాలు చేయడం ఉత్తమం అని అర్చకులు తెలి పారు. సర్వ రక్షాకరుడైన సుదర్శన భగవానుని ప్రార్థన చేస్తూ ప్రతీ అమావస్యకు ఈ సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు చిన్నజీయర్ ఆశ్రమ నిర్వాహకులు వెంకటాచార్యులు తెలియజేశారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంతస్వామి, వేద విద్యార్థులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌అండ్‌జేసీలో ఎన్‌సీసీ శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులకు హాజరైన ఎన్‌సీసీ విద్యార్థులు

గుంటూరు (విద్య), మే 27 (ఆంధ్రజ్యోతి): భారతదేశ రక్షణ వ్యవస్థలో విద్యార్థులు భాగస్వాములు అయ్యేందుకు సిద్ధంగా ఉండాలని, ఎన్‌సీసీ ద్వారా తీసుకునే శిక్షణ తరగతులు సైనిక శిక్షణలో ప్రాథమిక దశను పూర్తి చేసుకోవడంతో పాటు, నాయకత్వ లక్షణాలను పొందుపరచుకోవచ్చని క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్వీఎస్ సుదర్శన్ తెలిపారు. ఆర్‌వీఆర్ అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 10 ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు, పల్నాడు, ప్రకాశం నెల్లూరు జిల్లాలలోని వివిధ పాఠశాలలు, కళాశాల నుంచి ఎన్‌సీసీ బాలురు, బాలికల క్యాడెట్లు 710 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు జూన్ 4 వరకు జరుగుతాయని, ఇందులో పాల్గొన్న విద్యార్థులకు ఎన్‌సీసీ అధికారులు, నిపుణులతో యోగా, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, ట్రెక్కింగ్, ఫిజికల్ ట్రైనింగ్, లీడర్షిప్ క్వాలిటీస్, సోషల్ సర్వీస్ ఆక్టివిటీస్, సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఫైర్ అండ్ సేఫ్టీ డ్రిల్, ఎన్‌డీఆర్ఎఫ్ ట్రైనింగ్ తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ అవినాశి పట్వాల్, క్యాంపు సీనియర్ జేసీవో ఇమాం సాహెబ్ షేక్, క్యాంపు సూపరింటెండెంట్ కొల్లా రాజశేఖర బాబు, కళాశాల ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి స్ఫూర్తి ఫౌండేషన్ చేయూత



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి ప్రసాద్

మేడికొండూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద విద్యార్థికి ఉన్నత చదువుల కోసం చేయూతనందించి స్ఫూర్తి ఫౌండేషన్ పెద్ద మనసు చాటుకుంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామానికి చెందిన పెద్ది గోపాలకృష్ణకి తల్లి చిన్నతనంలోనే చనిపోయింది, తండ్రి క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న నాయనమ్మ వయస్సు పెద్దది కావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఈ పరిస్థితిలో విద్యార్థి పదో తరగతి మంచి మార్కులు సాధించినా కాలేజీ చదువుకు ఫీజు కట్టలేని స్థితిలో మానసిక వేదనకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివ ప్రసాద్ స్ఫూర్తి ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన స్ఫూర్తి ఫౌండేషన్ కాలేజీ ఫీజు కు అయ్యే ఖర్చు మొత్తం లక్షా ఇరవై వేల రూపాయలు చెక్కును మంగళవారం విద్యార్థి కి అందజేశారు. సిరిపురం గ్రామం కేంద్రంగా పని చేస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందనిఫౌండేషన్ ప్రతినిధి కంకణాల ప్రసాద్ చెప్పారు. ఈ సంద ర్భంగా విద్యార్థి బంధువులు స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పంచముఖ ఆంజనేయస్వామికి అరటి పండ్ల పూజ

తెనాలి అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): షరాఫ్‌బజారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి మంగళవారం 1108 అరటి పండ్లతో పూజ చేశారు. విశేష పూజలు, హోమాలు, లక్ష హనుమాన్ చాలీసా పారాయణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాలు పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, సురేష్, దాతలు కారంశెట్టి అమర్‌నాథ్, సంకీర్తన బృందం సభ్యులు అనురాధ, బాలకృష్ణ, చంద్రశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

తెనాలి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30గంటలకు పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించి జెండా అనంతరం మునిసిపల్ బిల్డింగ్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పురపాలక సంఘంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు: కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట,మే 27 (ఆంధ్రజ్యోతి): నేడు బుధవారం పురపాలక సంఘ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత నందమూరి తారక రామారావు జయంతిని ఘనంగా నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని రాష్ట్ర పండగగా జరుపుతున్నామని కమిషనర్ శేషన్న పేర్కొన్నారు.

యోగా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట,మే 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న యోగా మాసోత్సవ శిక్షణ శిబిరాలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. నేడు బుధవారం స్థానిక చెంచుపేటలోని ఎస్ఎల్ఎస్ కల్యాణ మండపంలో యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు తమ పేర్లను సచివాలయాలలో నమోదు చేసుకోవాలని కమిషనర్ శేషన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట,మే 27 (ఆంధ్రజ్యోతి): బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక గురవయ్య కాలనీ పాలాద్రి కాలువ వద్ద నాగరాజు అనే వ్యక్తి బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తుండగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

డీలర్లు రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలి: తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, మే 27 (ఆంధ్రజ్యోతి): డీలర్లు రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రేషన్ డీలర్లుతో సమీక్ష నిర్వహించారు. నిత్యావసర సరుకుల పంపిణీపై డీలర్లకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భగా సిద్ధార్థ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు డీలర్లు జూన్ 1వ తేదీ నుంచి నేరుగా లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఎటువంటి అవకతవకలు జరిగినా తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. రేషన్‌కార్డు దారులు కూడా డీలర్లకు సహకరించాలన్నారు. లబ్ధిదారుల నుంచి డీలర్లు ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఆర్ఐ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'పోలీసుల తీరు సరికాదు'

తెనాలి అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్‌పై దాడిచేసిన సంఘటనలో నిందితులపై పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ పేర్కొన్నారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, చట్టవిరుద్ధంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐతానగర్‌లోని బాధితుల కుటుంబంతో మాట్లాడామన్నారు. నిందితులను విచక్షణా రహితంగా కొట్టాలని ఏ చట్టంలో లేదన్నారు. ఇలాంటి సంఘటనలు పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపించాలని, నిందితులపై కఠినంగా వ్యవహరించిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు భావన్నారాయణ, ఏరియా కార్యదర్శి బాబుప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: ఎంపీపీ

కొల్లిపర, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా జీవించటానికి యోగాభ్యాసం ఉపయోగపడుతుందని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపరలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రజలను చైతన్య పరిచేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ నేటి ఆధునిక జీవనశైలి ఒత్తిడిని అధిగమించాలంటే యోగా ఒక్కటే ఏకైకమార్గం అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ భార్గవ్ పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం సాకారమయ్యేనా..?

❑ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న నిర్మాణం
❑ సెల్లార్‌లో పేరుకుపోతున్న చెత్తతో అపరిశుభ్ర వాతావరణం
❑ నిర్మాణం పూర్తిచేసి, వినియోగంలోకి తేవాలని పలువురి డిమాండ్



నిర్మాణం మధ్యలో ఆగిపోయిన షాపింగ్ కాంప్లెక్స్

తెనాలి, మారీసుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో వెనుక నిర్మిస్తున్న మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేనని పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్నారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.10కోట్ల అంచనాలతో ప్రణాళికలు రూపొందించి 2017లో పనులు ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న ఖాళీ స్థలంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తే పురపాలక సంఘానికి ఆదాయంతో పాటు పలు వ్యాపార సంస్థలు అందుబాటులోకి వచ్చి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని 2015లో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ భావించారు. మున్సిపల్ అధికారులను అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. దీనికోసం రూ.10.5కోట్లు నిధులతో డిజైన్లను సిద్ధం చేశారు. జీపీఎస్ నిధులు రూ.4.30 కోట్లు మిగిలిన రూ.6.20 కోట్లను మునిసిపల్ జనరల్ ఫండ్ నుంచి వినియోగించేలా చర్యలు చేపట్టారు. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి గుంటూరుకు చెందిన శ్రీనివాస అండ్ కంపెనీ 2017లో పనులను ప్రారంభించింది. పనులు ప్రారంభించిన 18నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. ఈ కాంపెక్స్‌లో 156 షాపులు నిర్మించేలా ప్లాన్‌ను రూపొందించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 28, మొదటి అంతస్తులో 24, రెండో అంతస్తులో 25, మూడో అంతస్తులో 52షాపులు నిర్మించేలా నిర్మాణాలు ప్రారంభించారు. గ్రౌండ్ ఫ్లోర్ వరకు కాంట్రాక్టర్ పూర్తి చేయగా అంతవరకు జరిగిన పనులకు రూ.4.24 కోట్లు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారం కోల్పోయి వైసీపీ అధికారం చేపట్టగానే అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసింది. అందులో భాగంగా కాంప్లెక్స్ నిర్మాణానికి గ్రహణం పట్టింది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కాంప్లెక్స్ నిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు.

జూదరుల నిలయంగా...

కోట్లాది రూపాయలతో నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పట్టణ నడిబొడ్డులోని ఈ కాంప్లెక్స్‌లో నిత్యం జూదరులు, మద్యం బాబులకు అడ్డాగా మారడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాంప్లెక్స్‌పై పోలీసుల నిఘా కూడా అంతంత మాత్రంగా ఉండటంతో రాత్రుళ్లు అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.

గతంలో ఓ వ్యక్తి సజీవదహనం

మద్యం సేవిస్తూ నిద్రించిన వ్యక్తి ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి అందులో చిక్కుకొని సజీవదహనమైన ఘటన కూడా ఈ కాంప్లెక్స్‌లో చోటుచేసుకుంది. అంతేకాకుండా గంజాయి, మద్యం సేవించేందుకు గుంపులు గుంపులుగా చేరి తరచూ అక్కడ ఘర్షణలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పేకాట ఆడుతుండగా అందులో ఒక వ్యక్తి ఓడిపోయి డబ్బులు కట్టాల్సివస్తుందన్న భావనతో పోలీసులు వస్తున్నారంటూ అరవడంతో పేక ముక్కలు వదిలివేసి పరుగులుపెడుతూ బిల్డింగ్‌పై నుంచి కిందకు దూకి పలువురు గాయపడి ఆసుపత్రిలోచేరి చికిత్స పొందిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. అధికారులు స్పందించి షాపింగ్ కాంప్లెక్స్ బిల్డింగ్ నిర్మాణ పనులను పూర్తిచేస్తే మున్సిపాలిటీకి అదనపు ఆదాయంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు కట్టడి అవుతుందని పలువురు ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలి

● వాళ్ళు కరుడు గట్టిన రౌడీషీటర్లు
● కానిస్టేబుల్‌నే చంపబోయారు
● ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): వాళ్ళు కరుడు గట్టిన రౌడీషీటర్లు... కానిస్టేబుల్‌నే చంపేందుకు యత్నించారు... పోలీస్ వ్యవస్థకే సవాల్ విసిరారని ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. గత నెలలో తెనాలిలోని ఐతానగర్ సెంటర్‌లో నడిరోడ్డుపై ఆయా రౌడీ షీటర్లకు పోలీస్ మార్క్ కౌన్సెలింగ్ ఇచ్చిన వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం విదితమే. దీనిపై ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలని ఆయన సూచించారు. తెనాలి ఐతానగర్ జయప్రకాష్ నగర్‌లో నివాసం ఉండే కన్నా చిరంజీవి పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడన్నారు. చిరంజీవి ఉన్నతాధికారుల సూచనల మేరకు తెనాలి 3 టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్నప్పుడు విధి నిర్వహణలో భాగంగా పలు కేసుల్లో నిందితులైన రౌడీషీటర్లు చేబ్రోలు జాన్ విక్టర్, దోమ రాకేష్‌లను కౌన్సెలింగ్ కోసం తెనాలి 3టౌన్ స్టేషన్‌కు గంజాయి తాగే అలవాటు ఉన్న ఇతర వ్యక్తులతో పిలిపించాడన్నారు. అప్పటి నుంచి రౌడీషీటర్లు కానిస్టేబుల్ చిరంజీవిపై వ్యక్తిగత కక్ష పెంచుకున్నారన్నారు. వేము నవీన్ అలియాస్ కిల్లర్, జాన్ విక్టర్, దోమ రాకేష్, షేక్ కరిముల్లాలు పోలీస్ కానిస్టేబుల్‌ను చంపేందుకు ఏప్రిల్ నెల 24 రాత్రి ఐతానగర్‌లోని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట చిరంజీవిని అడ్డుకుని, దాడిచేసి కత్తితో పొడిచేందుకు యత్నించగా చిరంజీవి తప్పించుకు పారిపోయాడన్నారు. దీనిపై పోలీస్ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారన్నారు. అయితే ఈ కేసులోని నిందితులందరూ కరుడుగట్టిన రౌడీషీటర్లని హత్యలు, హత్యాయత్నాలు, కొట్లాటలు, గంజాయి, దొంగతనాలు, మహిళలపై దాడులు వంటి అనేక నేరాలకు పాల్పడ్డారన్నారు. కరిముల్లా మినహా మిగిలిన వారిపై ఒక్కొక్కరిపై పదికి పైగా కేసులు ఉన్నాయన్నారు. కాగా కానిస్టేబుల్ చిరంజీవి ఫిర్యాదు మేరకు తెనాలి-2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసి ఆయా నిందితులను అరెస్ట్ చేశామన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించే కానిస్టేబుల్‌నే చంపడానికి ప్రయత్నించారంటే సామాన్యులను పరోక్షంగా భయభ్రాంతులకు గురిచేయడమే వారి ఉద్దేశంగా అనిపించిందన్నారు. వారిని అరెస్ట్ చేసే క్రమంలో నిందితులపై పోలీసులు కొంత అనుచితంగా వ్యవవహరించినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. గతంలో విశాఖలో మాస్క్ అడిగిన పాపానికి దళిత డాక్టర్‌ను నడిరోడ్డుపై చేతులు విరిచి కొట్టినప్పుడు పని చేయని కులం కార్డు, కరుడు గట్టిన రౌడీషీటర్‌ల విషయంలో కులం గురించి మాట్లాడటమేమిటనే వాదనలు కూడా వినిపిస్తున్నాయన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే... ఎప్పుడు పరిష్కరిస్తారు...?

● చూద్దాం చేద్దాం.. అని ఎన్నాళ్లంటూ నిలదీసిన కౌన్సిలర్లు
● నాలుగేళ్లుగా అభివృద్ధి లేదంటూ ఆగ్రహం



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, అధికారులను ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్లు త్రిమూర్తి, వెంకటేశ్వరావు

తెనాలి, మారీసుపేట,మే 27 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలోని పలు వార్డుల్లో ఎక్కడ సమస్యలు అక్కడే తిష్టవేసి ఉన్నాయి. అధికారులు రేపు మాపు అంటూ కాలయాపన చేస్తూ అభివృద్ధి కుంటుపరుస్తున్నారని అధికార, విపక్ష కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. తెనాలి కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగాయి. ఉదయం గం.11.30లకు అత్యవసర సమావేశం మొదలయితే, అజెండాలోని మొదటి అంశం చదువుతుండగా 4వ వార్డు టీడీపీ కౌన్సిలర్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ జనవరిలో పూర్తిచేసిన పనులకు ఇప్పుడు బిల్లులు ఎలా పెడతారని, ఆ పనికి అంత ఖర్చవుతుందా అని చైర్‌పర్సన్‌ని ప్రశ్నించారు. దీనిపై ఇన్‌చార్జ్ మున్సిపల్ ఇంజనీర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బిల్లులు ఆలస్యమయ్యాయని, ఆ పని ఖర్చు అవుతుందని సమాధానమిచ్చారు. ఇదే సందర్భంలో కౌన్సిలర్ పి త్రిమూర్తి లేచి సాధారణ సమావేశం నిర్వహిస్తారా లేదా అని అది ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని కమిషనర్ శేషన్నని కోరారు. శేషన్న సమాధానమిస్తు చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తామని తెలపగా చైర్‌పర్సన్ రాధిక కలుగజేసుకొని ఈ నెల ఆఖరులోపు నిర్వహిస్తామన్నారు. అజెండాలోని మూడో అంశం అమోదించారు. 3వ వార్డు కౌన్సిలర్ ఆవుల కోటయ్య, పలువురు కౌన్సిలర్లు వీధి కుక్కల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని కమిషనర్ శేషన్నను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ వీధికుక్కలను పట్టుకొని శస్త్రచికిత్సలు చేస్తున్నామన్నారు. వైస్‌చైర్‌పర్సన్ మాలేటిపాటి హరిప్రసాద్ అన్ని కాంట్రాక్టులు ఒక్కరికే ఇవ్వడం వల్ల పనులను ఇష్టారాజ్యంగా చేపడతున్నారని ఆరోపించారు. అనంతరం 12 అంశాలు చదవడం పూర్తికాగానే అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్లు కౌన్సిల్ సభ్యులు చెప్పడంతో కౌన్సిల్ సమావేశం ముగిసిందని చైర్‌పర్సన్ రాధిక ప్రకటించారు. ముందుగా మున్సిపల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.జయకర్‌ను కౌన్సిల్ సభ్యులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్‌నిర్మల, ఆర్‌వో రాంప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసులు, ఏఈలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుంగిన రోడ్డుకు మరమ్మతులు చేయాలి: కౌన్సిలర్ కుర్రా సుజాత

తమ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో రోడ్డు కుంగిపోయి నాలుగేళ్ల దాటిందని కౌన్సిలర్ సుజాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 200 మీటర్ల రోడ్డు వేయడానికి సంవత్సరాల తరబడి గడుపుతున్నారని ఆరోపించారు. అంతిమ సంస్కారాలకు వెళ్లేవారు సైతం మోకాలు నీళ్లల్లో అవస్థలు పడుతూ వెళ్లే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

వార్డులో ఒక్క రోడ్డు కూడా వేయలేదు: కౌన్సిలర్ బ్రహ్మేశ్వరావు

వార్డులో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారం ఎప్పుడని కౌన్సిలర్ తాడిబోయిన బ్రహ్మేశ్వరావు అధికారులను నిలదీసారు. నాలుగేళ్ల అవుతున్నా తన వార్డులో ఒక్క రోడ్డు కూడా వేయలేదని అధికారులపై తీరుపై మండిపడ్డారు. తన వార్డులో పారిశుధ్యం దారుణంగా ఉందని ఆరోపించారు. చైర్‌పర్సన్ తమ వార్డు సమస్యలపై దృష్టిపెట్టి వార్డు సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

కూటమి ప్రభుత్వంలోనే దళితులపై దాడులు పెరిగాయి

● మాజీ మంత్రి మేరుగ నాగార్జున

తెనాలి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారం చేపట్టాక దళితులపై దాడులు పెరిగాయని మాజీ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. మంగళవారం తెనాలి వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున మాట్లాడుతూ తెనాలి పట్టణంలో నడిబొడ్డున ముగ్గురు వ్యక్తుల మీద పోలీసులు అమానుషంగా కొట్టడాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. నేరాల్లో ముద్దాయిలుగా ఉంటే చట్ట ప్రకారం శిక్షించాలన్నారు. నడిరోడ్డుపై ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ముగ్గురుపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. కూటమి అధికారం చేపట్టిన తరువాత దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు, దళితులపై దాడులు పెరిగాయని ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో జరుగుతున్న దాడులు అన్నీ ఇన్నీ కావన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పొలుగులతో పొడిపించిన చరిత్ర కూటమి ప్రభుత్వాని దేనన్నారు. దళిత ఐపీఎస్ సునీల్‌కుమార్, సంజయ్‌లపై ఎటువంటి కారణాలు లేకుండా సస్పెండ్ చేసి దళిత వ్యతిరేకులుగా కూటమి ప్రభుత్వం నిలబడిందని ఘాటుగా విమర్శించారు. అనంతపురం ఉరవకొండలో దళితుడిపై దాడిజరిగిన తీరు, కర్నూలు జిల్లా ఆదోని మండలంలో దళితుడిని ట్రాక్టర్‌తో గుద్దించిన పరిస్థితి, దళిత డాక్టర్‌ను చెంపమీద కొట్టిన విధానం, నందికొట్కూరులో ఓ వ్యక్తి లాకప్‌డెత్, రాజంపేట మునిసిపల్ చైర్మన్ రాంబాబును బహిరంగంగా బయటకు లాగి అవమానించిన తీరు, స్వయాన ఉపముఖ్యమంత్రి పిఠాపురం నియోజకవర్గంలో దళితులను వెలివేసిన తీరు ఇలా అనేకం చోటుచేసుకున్నాయని ఆక్షేపించారు. తెనాలిలో యువకులను నడిరోడ్డుపై బహిరంగంగా పోలీసులే కొట్టడం చూస్తుంటే రాజ్యాంగం ఏమైపోతుందోనని ఆందోళన నెలకొందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఇటువంటి దారుణాలు ఎక్కడా కూడా జరగలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సరైందికాదన్నారు. తెనాలిలో తన తండ్రి, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇటువంటి ఘటనలకు ఎన్నడూ అవకాశం కల్పించలేదన్నారు. కూటమి రాకతో ముగ్గురు యువకులపై పోలీసులు బహిరంగంగా కొట్టడం చూస్తే సభ్యసమాజంలోనే ఉన్నామా అని అనుమానం కలిగిందన్నారు. చట్టాలు అందరికీ సమానమేనని యువకులపై జరిగిన దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. తక్షణమే యువకులపై చట్టవ్యతిరేకంగా చేసిన చర్యలకు ప్రభుత్వం బాధ్యత వహించి, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరి రేషన్‌కార్డు దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలి: ఎంపీడీవో విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, మే 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికి తప్పనిసరిగా రేషన్‌కార్డు ఇవ్వాలని వారు పెట్టుకున్న దరఖాస్తును పరిశీలించి ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లతో కొత్త రేషన్ కార్డులు, పింఛన్ల పంపిణీపై ఆమె సమీక్ష నిర్వహించారు. రేషన్ కార్డులు ఆన్‌లైన్ నమోదుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ రేషన్‌కార్డు దరఖాస్తుకు గడువు అనేది లేదని ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియజేశారు. పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, ఈవోపీఆర్డీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

పేదల అభ్యున్నతి కోసం ఆవిర్భవించిన పార్టీ టీడీపీ

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



మహానాడులో పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం ఆవిర్భవించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మంగళవారం కడపలో జరుగుతున్న మహానాడులో ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తల యోగక్షేమాలను తెలుసుకున్నారు. దివ్యాంగులకు అందించే సహాయక పరికరాలను, కృత్రిమ పరికరాలను పరిశీలించారు. పొన్నూరు నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి మహానాడు సభకు హాజరయ్యారు.

పిచ్చి కుక్కదాడి ... 12 మందికి గాయాలు

కొల్లిపర, మే 27 (ఆంధ్రజ్యోతి): పిచ్చి కుక్క 12మందిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండల పరిధిలోని వల్లభాపురంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం వల్లభాపురంలో ఒక వ్యక్తి పెంచుకుంటున్న కుక్కకు పిచ్చి ఎక్కడంతో దారిన వెళుతున్న వారిపై దాడికి దిగింది. ఈ దాడిలో 12మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మండల కేంద్రం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ భార్గవ్ సీహెచ్‌సీకి వచ్చి బాధితులను పరామర్శించారు. వైద్యాధికారులను అడిగి చికిత్స వివరాలను తెలుసుకున్నారు.



పూడిక తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

డ్రైయిన్లలో పూడిక తొలగించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): డ్రైయిన్లలోని పూడికను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక చిట్టాంజనేయ స్వామివారి గుడి వద్ద ఉన్న జంపని డ్రైయిన్‌లోని పూడిక తొలగింపు పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశిలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఇంటా బయటా వచ్చే వ్యర్థాలను డ్రైయిన్లలో వేయరాదన్నారు. తెనాలి పట్టాణాభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రోజు యోగాతో ఆరోగ్యకరమైన జీవనం

● ఎంపీడీవో ఉమాదేవి

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవనం గడవచ్చని చేబ్రోలు మండల ఎంపీడీవో ఉమాదేవి చెప్పారు. మంగళవారం చేబ్రోలులో గాలిగోపురం వద్ద కమ్యునిటీ హాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు యోగాపై ఐదు రోజులు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఉమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రజలందరూ సంపూర్ణ ఆర్యోవంతమైన జీవనం సాగించాలని యోగాంధ్ర పేరిట గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నద్ధం చేస్తుందన్నారు. ఐదురోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాలు ముగిసిన తరువాత ఆయా పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు యోగా ప్రాముఖ్యంపై అవగాహన కల్పించడంతో పాటు ఆసనాలను నేర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సుబ్బారావు, పలు గ్రామాల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో వినయశ్రీ, జ్ఞానదివ్య ప్రతిభ



పతకాలు సాధించిన వినయశ్రీ, జ్ఞానదివ్య

మంగళగిరి సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరిగిన జాతీయ సబ్‌జూనియర్, జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మహిళా లిఫ్టర్లు ఈఎల్ వినయశ్రీ, నాగం జ్ఞానదివ్యలు సత్తా చాటారు. సబ్ జూనియర్స్ 84 కిలోల విభాగంలో వినయశ్రీ స్క్వాట్‌లో 122.5 కిలోలతో కాంస్యం, బెంచిప్రెస్‌లో 50 కిలోలతో రజతం, డెడ్‌లిఫ్ట్‌లో 130కిలోల కాంస్యం, ఓవరాల్‌గా 302.5 కిలోల బరువును ఎత్తి రజత పతకం సాధించింది. జూనియర్స్ 84కిలోలు పైబడిన విభాగంలో జ్ఞానదివ్య స్క్వాట్‌లో 177.5 కిలోలతో స్వర్ణం, బెంచిప్రెస్‌లో 62.5 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 155 కిలోలతో కాంస్యం, ఓవరాల్‌గా 395 కిలోల బరువును ఎత్తి రజత పతకం సొంతం చేసుకుంది. పతకాలు సాధించిన మహిళా లిఫ్టర్లను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, సకల సూర్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విజయభాస్కరరావు, షేక్ సంధాని తదితరులు అభినందించారు.



యోగాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

ఆరోగ్యం కోసం యోగా చేయాలి

● మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): మంచి ఆరోగ్యం కోసం క్రమం తప్పకుండా యోగా చేయాలని దీని ప్రాముఖ్యతను పట్టణ, గ్రామ స్థాయిలలో ప్రజలకు తెలిపేలా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు చెప్పారు. మంగళవారం పట్టణంలోని లైన్స్ క్లబ్‌లో యోగాంధ్రలో భాగంగా ఐదు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలను కమిషనర్ రయేష్‌బాబు ప్రారంభించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 7.30గంటల నుంచి 8.30వరకూ ఐదురోజులు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యోగా మాస్టర్ ట్రైనర్‌గా షేక్ యాసిన్‌బాబా యోగాసనాలను వేయిస్తూ వాటి ప్రాముఖ్యతను తెలుపుతున్నారన్నారు. అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. ఎం.సుబ్రహ్మణ్యం, ఆకుల సాంబశివరావు, నాగమంజరి, పాపారావు, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, లక్ష్మీనారాయణ, అహ్మద్‌ఖాన్, బాజీసాహెబ్, ఫైరోజ్‌ఖాన్, వీరబాబు, పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.